# ధర్మఘంటి

జాతీయ తెలుగు దినపత్రిక

TELTEL/2012/47103

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 124 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | ఆదివారం, 3 ఆగస్టు 2025 | పేజీలు : 8 వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


### ఐడీబీఐ బ్యాంక్‌లో వాటాల విక్రయానికి అక్టోబరులో ఆర్థిక బిడ్స్

ప్రభుత్వ రంగంలోని ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటాల విక్రయాన్ని త్వరిత గతిన పూర్తి చేయటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. బ్యాంక్‌లో వాటాల విక్రయానికి సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికం (అక్టోబరు–డిసెంబరు)లో ఆర్థిక (ఫైనాన్షియల్) బిడ్స్‌ను ఆహ్వానించను న్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) కార్యదర్శి అరుణిష్ చావ్లా వెల్లడించారు.

### ఐటీసీ లాభం రూ.5,343 కోట్లు

ఐటీసీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.5343.41 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2024–25 ఇదే కాల లాభం రూ.5176.99 కోట్లు. ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ.19,350.08 కోట్ల నుంచి రూ.23,129.35 కోట్లకు పెరిగింది. వ్యయాలు కూడా 26.73% పెరిగి రూ.16,752.31 కోట్లుగా నమోదయ్యా యి.



## మహాదేవుని ఆశీస్సులతో ‘పహల్గామ్’పై ప్రతీకారం

- ఆపరేషన్ సిందూర్ విజయాన్ని మహాశివుని పాదాలకు అంకితమిస్తున్నాను’
- ‘ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారి కాశీకి వచ్చాను
- ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్‌లో ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు దారుణంగా హత్యకు గురయ్యారు.
- బాధిత కుటుంబాలకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని నేను కాశీ విశ్వనాథుణ్ణి ప్రార్థించాను’

# ప్రజా క్షేత్రంలోకి మీనాక్షి

- రాష్ట్రంలో కొన్ని ఎంపిక చేసుకున్న నియోజకవర్గాల్లో పాద యాత్ర,
- ప్రజలతో ఈ పర్యటనలో భాగంగా మాట్లాడి, పార్టీ పరిస్థితీ, ప్రభుత్వ పనితీరు, కాంగ్రెస్ పార్టీ విధానాలకు సంబంధించి గ్రౌండ్ లెవెల్లో ఫీడ్ బయటకు తీసుకుంటున్నారు
- ప్రజల మనోభావాలు, వారి సమస్యలు, అందుకు ప్రతిగా పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆమె నిశితంగా పరిశీలించే అవకాశాలున్నాయి



హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో కొన్ని ఎంపిక చేసుకున్న నియోజకవర్గాల్లో పాద యాత్ర, శ్రమదానం పేరుతో పర్యటిస్తున్న సందర్భంగా రాజకీ యంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో కొన్ని గ్రామాలలో ప్రజలతో ఈ పర్యటనలో భాగంగా మాట్లాడి, పార్టీ పరిస్థితీ, ప్రభుత్వ పనితీరు, కాంగ్రెస్ పార్టీ విధానాలకు సంబంధించి గ్రౌండ్ లెవెల్లో ఫీడ్ బయటకు తీసుకుంటున్నారు. ప్రజల మనోభావా లు, వారి సమస్యలు, అందుకు ప్రతిగా పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆమె నిశితంగా పరిశీలించే అవకాశాలున్నాయి. ఈ పర్యటన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జిగా బాధ్యతలు తీసుకున్న తరువాత పార్టీని క్రమశిక్షణలో నడుపుతున్న ఒక - మిగతా3లో



## ‘ఆపరేషన్ అఖల్’లో ఉగ్రవాది హతం

- పాక్ ఉగ్రవాదల ఏరివేతకు భారత్ నడుంబిగించింది
- నిఘా వర్గాల సమాచారం ఆధారంగా దక్షిణ కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలోని అఖల్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్
- ఇప్పటివరకు భద్రతా దళాలు ఒక ఉగ్రవాదిని మట్టుబెట్టాయని వెల్లడి

## పారిశ్రామికవేత్తలపై దాదాగిరి.. అభివృద్ధికి అడ్డంకిగా మారుతోంది

## 50 ట్రిప్స్.. జీరో రిజల్ట్స్!

- సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనలపై కేటీఆర్ సెటైర్లు
- రేవంత్ ఢిల్లీ యాత్రలకు.. తెలంగాణకు ఏ సంబంధం లేదు
- మొదటి పని – ఫ్లైటు టికెట్ బుక్ చేయడం! రెండో పని – ఢిల్లీకి పోవడం!
- మూడో పని– ఖాళీ చేతులతో తిరిగి రావడం!
- రైతులు పొలాల్లో జల్లడానికి యూరియా లేదు.. సాగునీళ్లు రావు.. తాగునీళ్లు లేవు..



హైదరాబాద్


హస్తిన యాత్రలో సీఎం రేవంత్ రెడ్డి అర్ధ శతకం సాధించారు.. 50 ట్రిప్స్.. జీరో రిజల్ట్స్ అని పేర్కొంటూ సీఎంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా ఫ్లైట్ బుకింగ్స్‌తో రేవంత్ రెడ్డి నడిపిస్తున్నారు. రేవంత్ ఢిల్లీ యాత్రలకు.. తెలంగాణకు ఏ సంబంధం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలన చేపట్టాక రేవంత్ చేసిన మూడు పనులు ఇవే.. మొదటి పని – ఫ్లైటు టికెట్ బుక్ చేయడం! రెండో పని – ఢిల్లీకి పోవడం! మూడో పని– ఖాళీ చేతులతో తిరిగి రావడం! అని కేటీఆర్ పేర్కొన్నారు. రైతన్నలు ఇబ్బందులను - మిగతా3లో

## పార్లమెంట్ సాక్షిగా తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయం

- రాష్ట్రానికి ఖరీఫ్ 2025కి కేటాయించిన యూరియా 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే
- పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పడం వలన రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



## ఆ అణుబాంబును పేల్చనివ్వండి



- రాహుల్‌కు రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్
- తనవద్ద అణుబాంబు ఉందని రాహుల్ గాంధీ అన్నారు.
- గతంలో భూకంపం అంటూ హెచ్చరికలు చేశారు
- కానీ తర్వాత అది తుస్సుమంది

## దేవగౌడ మనవడికి జీవితఖైదు



- పని మనిషిపై అత్యాచార కేసులో బెంగళూరు ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే.
- ప్రజ్వల్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 5 లక్షలు జరిమానా
- బాధితురాలికి రూ.7 లక్షలు చెల్లించాలని ఆదేశించింది.
- అత్యాచారం చేసి బెదిరించాడని గతేడాది మహిళ ఫిర్యాదు



## నేను రాజును కాను.. కావాలనుకోవడం లేదు

- రాహుల్ గాంధీ వ్యాఖ్యలు..
- దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయింది
- 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది
- దాదాపు 70 నుంచి వంద స్థానాల్లో రిగ్గింగ్ జరిగి ఉండవచ్చు



## రైతును రారాజును చేయడమే మోదీ లక్ష్యం!!

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- ఎరువుల కోసమే సబ్సిడీ రూపంలో రూ.11 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేశాం
- కనీస మద్దతు ధర అందించేందుకు రూ.16 లక్షల 35 వేల కోట్లు ఖర్చు చేసిన మోదీ సర్కార్
- కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రైతుల ఖాతాల్లో రూ.3 లక్షల 69 వేల 561 కోట్లు జమ..
- దేశంలోని ఎంపీలంతా సైకిళ్ల పంపిణీ గురించి వాకబు చేస్తున్నారు

కరీంనగర్

11 ఏళ్లలో రైతుల కోసం రూ.71 లక్షల కోట్లు ఖర్చు చేసిన మోదీ ప్రభుత్వం ఎరువుల కోసమే సబ్సిడీ రూపంలో రూ.11 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేశాం. - మిగతా3లో

# రాహూల్‌ని ప్రధానిగా చేసి చూపిస్తాం



- దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్
- భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయి
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు 150 సీట్లు దాటకుండా చూస్తాం
- “ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి
- ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉన్న పార్టీ కాంగ్రెస్.
- కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు
- సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు.

ఢిల్లీ

దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని తెలిపారు. “ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉన్న పార్టీ కాంగ్రెస్. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉంది. 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించట్లేదు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోంది. మా పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శిస్తున్నారు. 140 ఏళ్ల క్రితం దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం కదం తొక్కింది. ఆంగ్లేయులను ఓడించింది. భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ - మిగతా3లో



## అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత..

- ఇప్పటి వరకూ 4.10 లక్షల మంది దర్శనం
- జమ్ము కశ్మీర్‌లోనూ కుండపోత వర్షాలతో పలు నదులు పొంగి పొర్లుతున్నాయి
- పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి.
- ఈ ఏడాది దాదాపు 5 లక్షల మందికిపైగా భక్తులు మంచు లింగాన్ని దర్శించుకోనున్నట్లు అధికారులు అంచనా

## సంపాదకీయం

# ప్రధాని- ఆర్ఎస్ఎస్ మధ్య అంతరం పెరుగుతోందా!

భాజపా – ఆరెస్సెస్ అనుబంధం భారత రాజకీయంలో అత్యంత ఆసక్తికరమైన, శక్తివంత మైన సంబంధాల్లో ఒకటి. జనసంఘం కాలం నాటికే ఆరంభమైన ఈ అనుబంధం, భారతీయ జనతా పార్టీ స్థాపన తర్వాత మరింత బల పడింది. ఆరెస్సెస్‌లో సేద్యం చేసిన కర్షకులు, పౌర అభ్యుదయమే లక్ష్యంగా భావించే స్వయం సేవకులు, భాజపాలో కీలక స్థానాల్లోకి వచ్చారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నుంచి ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ వరకు ఆరెస్సెస్ ప్రభావం స్పష్టంగా కనిపించేది. కానీ, నరేంద్ర మోదీ మూడవ సారి ప్రధానిగా పదవిలోకి వచ్చిన తర్వాత ఆయన పాలనా శైలి, ఆరెస్సెస్ భావజాలం మధ్య తేడాలు కనబడు తున్నాయని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.ఆరెస్సెస్, సిద్ధాంతపరంగా నూతన భారత నిర్మాణంలో 'సంస్కార' ప్రాతిపదికగా సామాజిక మార్పు, హిందుత్వ విలువల ప్రచారం ద్వారా జాతి నిర్మాణాన్ని కోరుతుంది. కానీ మోదీ పాలన నిత్య రాజకీయ దృష్టితో ముందుకు సాగుతున్నది. ఆయన నూతన భారత నిర్మాణంలో సామాజిక పరిమాణాల కన్నా రాజకీయ విజయమే ప్రధాన లక్ష్యంగా మారింది. ముఖ్యంగా ప్రజల మద్దతుతో కూడిన శక్తిమంతమైన నరేంద్ర మోదీ బ్రాండ్ నిర్మాణం, నిత్యం ఎన్నికల మూడ్, మెగా స్కీమ్‌లు, హిందూ ఓటు బ్యాంకు సమీకరణం వంటి అంశాలు గణనీయంగా మారాయి. ఈ క్రమంలో భాజపా కార్యనిర్వాహక నియంత్రణ ఆరెస్సెస్ చేతిలో ఉండకుండా, ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ కేంద్రీకృత మవుతోంది. నరేంద్ర మోదీ నియామకాలు, భవిష్యత్ రాజకీయ వారసత్వంపై తనదైన శైలి ప్రవేశ పెడుతున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవలి మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మోదీ కేబినెట్ ఎంపికలో ఆరెస్సెస్ సూచనలు పూర్తిగా ప్రతిఫలించలేదనే విమర్శలు ఉన్నాయి. విశేషంగా, మురళీధర్ రావు, సంజయ్ మయుఖ్ వంటి స్వయం సేవకుల అభ్యర్థిత్వం పక్కన పెట్టడమే కాక, సంస్కృతి, విద్య, సమాజ సేవ రంగాలకే చెందిన వారికీ తక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలుస్తోంది. అంతేకాక, బిఎల్ సంతోష్ వంటి సంఘ ప్రచారకులు ఇప్పటికే పార్టీ పొలిటికల్ కంట్రోల్ నుంచి పక్కకు నెట్టబడ్డారని వాదనలు వచ్చాయి. దీంతో, ఆరెస్సెస్ మౌనం తప్ప మరో ప్రకటన చేయలేదు. ఇక ఆరెస్సెస్ సిద్ధాంతాలపై కేంద్రం దృష్టి మరిచిందని విమర్శలు వినిపిస్తున్నాయి. సంస్కృత భాషా అభివృద్ధి, ధర్మాచార్య వ్యవస్థకు ప్రోత్సాహం, ఆరెస్సెస్ అనుబంధ విద్యా సంస్థలకు నిధుల అనుకూలత వంటి రంగాల్లో మోదీ హయాంలో అనేక ఆశలున్నప్పటికీ, వాటి అమలులో చురుకుదనం తగ్గిందని సంఘ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాక, నూతన విద్యా విధానం, యూనిఫాం సివిల్ కోడ్, జనాభా నియంత్రణపై చట్టాలు వంటి హిందుత్వ సంబంధిత ముఖ్య రంగాల్లో తక్షణ చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరగడంతో, ఆరెస్సెస్ లో అసంతృప్తి పెరిగిందనే అభిప్రాయం వ్యాపక మవుతోంది. ఈ నేపథ్యంలో, ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల పదే పదే చేస్తున్న వ్యాఖ్యలు గమనించదగ్గవే. రాజకీయ నాయకులు వయసు 75 దాటిన తరువాత పదవులు వదిలిపోవాలని, తద్వారా యువతకు అవకాశం కల్పించ బడాలని ప్రకటించారు. ప్రధాని మోదీ కూడా 75కి చేరుతున్నందువల్ల, ఇది ప్రత్యక్ష సంకేతమా అనేదీ విమర్శలు ఉన్నాయి. ఆయన్ని స్వయంగా మోదీ కలవక పోవడం, భాజపా అగ్రనేతలు కోపతాపాలకు లోనై ,స్పందించక పోవడం అన్నీ రాజకీయ విశ్లేషకుల దృష్టికి వచ్చాయి. 'ఆసక్తికరమైన సమాజం కోసం రాజకీయాలు మారాలి', 'దేశ భవిష్యత్ కోసం మత సామరస్యమే మార్గం', 'నిర్బంధం కాదు, నైతికతే ముఖ్యమని' భాగవత్ పలుమార్లు చెప్పడం ద్వారా మోదీ పాలనను వ్యంగ్యంగా విమర్శించినట్టు భావన కలుగుతోంది. మోదీ కేంద్రీకృత పాలన విధానం, మంత్రివర్గ వ్యవహార శైలి, ఆయా రాష్ట్రాల భాజపా ముఖ్యమంత్రుల ఎంపికలో ఆరెస్సెస్ పాత్ర తగ్గిపోవడం వంటి అంశాలు ఈ వివిధాంతరాన్ని మరింత స్పష్టంగా చేస్తున్నాయి. అయితే ఇది పూర్తిగా విభేదం కాదు. మోదీ–ఆరెస్సెస్ మధ్య సంబంధం మౌలికంగా ఒకే భావజాలపు పునాది మీద నడుస్తున్నా, దాని కార్యరూపాలు, ప్రామాణికతల్లో తేడాలు రావడం సహజం. ప్రధానిగా మోదీ రాజకీయ అవసరాల దృష్టితో నిర్ణయాలు తీసుకుంటే, ఆరెస్సెస్ దాన్ని ధర్మ, సంస్కృతి, సంయమనం అనే పరిమాణాలతో పరిశీలిస్తుంది. అందువల్ల, ఈ అంతరం వాస్తవమే అయినా, అది శాశ్వత శత్రుత్వానికి దారితీయదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. భాజపా – ఆరెస్సెస్ బంధం అనుబంధంగా పుట్టినదే. కానీ మోదీ బ్రాండ్ అధికంగా మూర్తిమత్వం చెందుతున్న ఈ కాలంలో ఆ అనుబంధం క్రమంగా బలహీన పడుతున్నదని విశ్లేషకుల భావన. భావజాలం ఒకటే అయినా, దానిని ఆచరణలోకి తీసుకు రావడంలో మోదీ దారిలో ఆరెస్సెస్ నడవటం కష్టమవుతోంది. ఇది భారత రాజకీయాల్లో ఓ మౌలిక మార్పుగా పరిగణించ వచ్చు. మోదీ తర్వాత భాజపా – సంఘ పరస్పర సంబంధాలు ఎటు పోతాయన్నది ఆసక్తికరమైన ప్రశ్నగా నిలుస్తోంది.

# సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత



హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ అలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. దీన్నే తెలంగాణ విమోచనోద్యమంగా. కూడా పిలుస్తారు. నిజాం ఉస్మాన్ అలీఖాన్ స్థాయి నుంచి గ్రామాల్లోని దొరల వరకూ సాగిన అణచివేత విధానాలకు నిరసనగా తెలంగాణ సాయుధ పోరాటం పురుడు పోసుకుంది. వెట్టి చాకిరి, భావ వ్యక్తీకరణపై తీవ్ర ఆంక్షలు, మాతృ భాషలపై అణచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు వంటి ఎన్నో పరిణామాలు పోరాటానికి నేపథ్యంగా నిలిచాయి. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం దక్షిణాసియాలో, భారత దేశంలో స్వాతంత్ర్యానంతరం జరిగిన తొలి సాయుధ రైతాంగ తిరుగు బాటుగా జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించింది. ఆ విధంగా అది ఎన్నో సాయుధ పోరాటాలకు, ఉద్యమాలకు ఈ పోరాటం స్ఫూర్తి దాయకంగా నిలిచింది. నిజాం నిరంకుశ పాలనకు, దొరల, భూస్వాముల, దేశముఖ్ దోపిడీకి, అణిచివేతకు, హింసకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటమిది. దేశంలోనే తొలిసారిగా భూ సమస్యను బలంగా ముందుకు తెచ్చి భూ సంస్కరణల చట్టానికి నాంది పలికిన పోరాటమిది. తెలంగాణలో ముఖ్యంగా నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలో ప్రతిపల్లె, ప్రతి గడప సాయుధ పోరులో మమేకమైనవే. దొడ్డి కొమరయ్య అమరత్వం నుంచి ప్రారంభమైన పోరులో వేలాదిమంది పోరాట యోధులను నిజాం పోలీసులు, రజకార్లు, భూస్వాములు, గుండాలు హత మార్చిన హృదయ విదారక నేపథ్యం. ఈ పోరాటం మామూలు వ్యక్తి నుండి మేధావుల వరకు ఆడమగ తేడా లేకుండా ఎందరినో కదనరంగం లోకి ఆకర్షించింది. అలాంటి వారిలో దాయం ప్రియంవద ఒకరు. దాయం ప్రియంవద (1928 – ఆగస్టు 3, 2013) తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడిన మహిళ. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దాయం రాజిరెడ్డి సోదరి. భీమిరెడ్డి నరసింహారెడ్డి, శశిరేఖ, మల్లు స్వరాజ్యం తదితర ఉద్యమ కారులంతా ప్రియంవద సమీప బంధువులు. నల్గొండ జిల్లా, తుంగతుర్తి మండలం వెంపటి సమీపంలోని తూర్పుగూడెంలో 1928లో లక్ష్మమ్మ, రామకృష్ణారెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. ప్రియంవదది మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. రష్యన్ సాహిత్యం, గోర్కి నవలలు, రెండో ప్రపంచ యుద్ధం గురించి వెలువడిన పుస్తకాల పట్ల ఆసక్తిని కలిగి చదవడం వల్ల నాటి సమకాలీన పరిస్థితిని ఒంట పట్టించుకున్నారు. సుశిక్షితురాలైన గెరిల్లా సైనికురాలు ప్రియంవద తెలంగాణ సాయుధ పోరాటంలో కాలూనారు. 1943 సంవత్సరంలో 15ఏళ్ళ వయసు లోనే అన్న రాజిరెడ్డితో కలిసి ఖమ్మం ఆంధ్రమహాసభలో పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మభిక్షం, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దాయం రాజిరెడ్డి లతో కలిసి సూర్యాపేట ప్రాంతంలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. గెరిల్లా సైనికురాలిగా ఆయుధం పట్టడానికి ముందు ఆమె విజయవాడలో ఆత్మరక్షణ, ఆయుధశిక్షణ పొందారు. సాయుధ పోరాటంలో గాయపడ్డ యోధులకు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకంగా ఆరోగ్యసేవిక (నర్సింగ్) ట్రైనింగ్ పొందారామె. పదిహేనేళ్ల ప్రాయంలో ఆమె ఉద్యమం పట్ల ప్రభావిత మైనారు. స్త్రీల సమస్యలపై, రైతు కూలీల సమస్యలపై అన్నతో కలిసి ఉద్యమ బాట పట్టారు. 1952లో జరిగిన ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో పిడిఎఫ్ అభ్యర్థుల విజయానికి కృషిచేశారు. మహిళా హక్కుల సాధన, బాల్య వివాహాల నిర్మూలన, బాలికా విద్య కోసం ఉద్యమం చేపట్టారు. మహిళల కూలీరేట్ల పెంపు కోసం ఆమె రాజీలేని పోరాటం సాగించి, పెద్ద రైతు కుటుంబ నేపథ్యం కలిగిఉన్న అర్ధశేరు వడ్లు మాత్రమే ఉండే రోజు కూలీని, రెండుశేర్ల వడ్లు కూలీగా ఇప్పించారు. ఆంధ్రమహాసభలు వరంగల్, ఖమ్మంలో జరిగిన తర్వాత అన్న రాజిరెడ్డిను భువనగిరి ప్రాంతంలో పార్టీ ఆర్గనైజర్‌గా నియమించారు. ఇబ్బందుల్లో ఉన్న రాజిరెడ్డికి తోడుగా కొలనుపాక జైన మందిరంలో నడిపే స్కూలులో యాభై రూపాయల జీతంతో టీచర్‌గా చేరారు. అక్కడ ఒక సంవత్సరంపాటు పనిచేశారు. ఆసమయంలో వీరి కుటుంబంపై ప్రభుత్వం నిషేధం విధించడంతో 1944లో విజయవాడ వెళ్లారు. అక్కడ జరిగిన అఖిలభారత కిసాన్ మహాసభకు వలంటీర్‌గా పనిచేశారు. ఆ తర్వాత వివిధ గ్రామాలకు వెళ్లి తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఆడవాళ్లలో చైతన్యం కలిగించారు. నల్గొండ జిల్లాలో పలు గ్రామాల్లో తిరిగి, పోరాట వ్యూహాల గురించి సమాజంలో స్త్రీలకుండే ఇబ్బందులు, వాటిని ఎదుర్కొనే పద్ధతులను గురించి, ఉత్తేజ ప్రసంగాల ద్వారా వివరించే ప్రయత్నాలు చేశారు. చదువు విషయంలో ఎవరైనా ముందుకొస్తే వాళ్ళకు పాఠాలు చెప్పారు. ఊళ్ళల్ల రజాకార్ల ఒత్తిడి ఎక్కువగా ఉన్న సమయంలో అమ్మను, నాన్నను చూసేందుకు సొంతూరుకు వెళ్ళిన విషయం తెలుసుకున్న పోలీసులు రాత్రి సమయంలో స్టేషనుకు, ఆపై తుంగతుర్తి క్యాంపుకు, తర్వాత సూర్యాపేటకు, చివరకు హైదరాబాద్ తరలించి, చంచల్‌గూడ జైల్లో బంధించారు. మూడు నెలల తర్వాత బయటికి జైలు నుంచి వచ్చిన ఆమె ఆయుధాలు పట్టి కాల్చడం నేర్చుకున్నారు. దళంలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా పరోక్షంగా మాత్రమే సహాయం అందించారు. మరోసారి స్వంత ఇంటిలో అరెస్టయి సికింద్రాబాద్ కంటోన్మెంట్ జైలుకు, ఆనంతరం వరంగల్ జైలుకు పంపబడ్డారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జైళ్ళలోనూ ఆమె జైలు జీవితం గడిచింది. ఎంచుకున్న లక్ష్య సాధన కోసం ఆమె వివాహం చేసుకోక ఒంటరిగానే బతికారు. ఉద్యమ రోజుల్లో ప్రజలకు అత్యంత దగ్గరగా గడిపిన ఆమె చివరి రోజుల్లో ప్రజా జీవితానికి దూరంగా జీవిస్తూ 2013, ఆగస్టు 3 న తుది శ్వాస విడిచారు.

# స్నేహమే దారి దీపం..!

స్నేహం అంటే ఓ త్యాగం, ఆపదలో అభయ హస్తం, కష్టాల్లో ఓ శీతల నేస్తం, ఆపదలో సాంత్వన నీడను చేకూర్చే మహా వృక్షం. ప్రాణ స్నేహితులకు ప్రత్యామ్నాయం ఉండదు. స్నేహం చేయని మనిషి ఉండడు. స్నేహితులు లేని తనువు ఉండదు. ప్రతి వ్యక్తి జీవితంలో స్నేహానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. స్నేహితుల హస్తాలు నిస్వార్థ నేస్తాలు. బంధువుల తో లేని ఓ అపురూపమైన అనుబంధం స్నేహితులతో ఉంటుంది. కొన్ని సమయాల్లో కుటుంబ సభ్యులతో పంచుకోలేని విషయాలను సహితం స్నేహితులతో పంచుకుంటాం. మనకు స్నేహితులు అనేకులు ఉండవచ్చు కాని ప్రాణ మిత్రులు కొద్ది మంది మాత్రమే ఉంటారు. ప్రాణ స్నేహితులతో మనం అన్ని విషయాలను దాపరికం లేకుండా పంచుకుంటాం. మనసుకు ప్రశాంతత, శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది స్నేహ హస్తం. సహానుభూతికి ఓ చక్కని ఉదాహరణ స్నేహం. పరస్పర గౌరవానికి, త్యాగానికి చిరునామా ఫ్రెండ్‌షిప్. సన్నిహిత మిత్రుడు అంటే ఓ మహా నమ్మకం. స్నేహానికి వయోభేదం లేదు. చంటి వాడి నుంచి పండు ముసలి వరకు అందరికీ స్నేహితులు ఉంటారు, వద్దన్నా ఆనందాలను వడ్డిస్తూ ఉంటారు. స్నేహం విలువను తెలుసుకోవడం, మంచి స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం, అపార్థాలను నివృత్తి చేసుకొని స్నేహాన్ని కొనసాగించడం, బేధాభిప్రాయాలను దూరం చేసుకోవడం, పౌర సమాజంలో శాంతి పందిరి వేయడానికి అనుకూలమైన అనువైన సందర్భంగా ప్రతి ఏట ఆగస్టు మాసంలోని మొదటి ఆదివారం రోజున "జాతీయ స్నేహ దినోత్సవం (నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే)" పాటించడం కొనసాగుతున్నది. 2025 జాతీయ స్నేహ దినం వేదికగా స్నేహ మార్గం ద్వారా శాంతి, సంఘీభావం, సంస్కృతుల మధ్య అవగాహనలను పెంపొందించే ప్రయత్నాలు నిర్వహించాలి. వివిధ దేశాలు, జాతులు, మతాలు, కులాలు, అసమానతలను మరిచి అందరం స్నేహ బంధంతో ఏకం కావడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటాం. స్నేహ బందం పరమ పవిత్రమైనది. నిజమైన స్నేహితుల మధ్య విడదీయరాని ప్రేమ అనే అభేద్య బంధం పెనవేసుకొని ఉంటుంది. మంచి స్నేహితులు కొన్ని విషయాల్లో విభేదించినా, సదా ఒక్కటిగానే ఉంటారు. చిన్ననాడే స్నేహం అనే బంధం మొలకెత్తుతుంది. అమ్మనాన్న తర్వాత మన సంక్షేమాన్ని, శ్రేయస్సును నిస్వార్థంగా తలుస్తూ మన వెంట నడిచే వ్యక్తులు మన ప్రాణ మిత్రులు మాత్రమే. బడికి వెళ్లడంతో మనకు నూతన స్నేహితులు పుడతారు. వారితోనే మన దినచర్య ముడిపడి ఉంటుంది. చదవడం, ఆడడం, పాడడం, మాట్లాడుకోవడం, సరదాగా తిరగడం లాంటివి మన ప్రాణ స్నేహితులతోనే ముడిపడి ఉంటాయి. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునే స్థాయికి స్నేహం ఎదుగుతుంది. తరగతులు పెరిగిన కొద్దీ తరగతులు మారుతూ, కొత్త మిత్రులు వచ్చి చేరతారు. పాత మిత్రుల స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. స్నేహితులు పెరిగిన కొద్దీ బయటి ప్రపంచం కొత్తగా కనిపిస్తుంది. అందరి సంస్కృతీ వారసత్వాలు అర్థం అవుతాయి. మన జీవితానికి లక్ష్యాలను కూడా మిత్రులు నిర్ణయించుకునే స్థాయి కూడా వస్తుంది. అంతర్జాతీయ స్నేహ దినం వేదికగా పాత మిత్రులను కలవడం, కొత్త మిత్రులతో సరదాగా గడపడం, ఆపాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ పంచుకోవడం, తమ తమ అనుభవాలను పంచుకోవడం, స్నేహితుల కష్టాలను తెలుసుకొని సహాయం చేయడం, సామాజిక మాధ్యమాల్లో స్నేహ బంధాల విలువను వివరించడం, పాత స్నేహితులతో ఉన్న ఫోటోలను పంచుకోవడం, హాపీ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు.

# బయటపడుతున్న అమెరికా అసలు రూపం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడు చూస్తుంటే అమెరికా అగ్రరాజ్య హోదాకు ఆశలు వదిలేసుకోకతప్పదా అనిపిస్తున్నది. ఆయన వలసదారుల కబంధ హస్తాల నుంచి అమెరికాను విముక్తి చేస్తానంటూ ఎడాపెడా జారీ చేస్తున్న ఉత్తర్వులు, ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు ప్రపంచ దేశాలలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. జన్మతహ పౌరసత్వం విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం కానీ, హెచ్1బి వీసాల విషయంలో అమలు చేస్తున్న ఆంక్షలు కానీ, ఇంకెంత మాత్రం ఇతర దేశాల నుంచి డాలర్ డ్రీమ్స్ తో అమెరికాకు వద్దామనుకునే వాళ్లను ఒకటికి పది సార్లు ఆలోచించేలా చేస్తున్నదనడంలో సందేహం లేదు.ఇక తాజాగా ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా పౌరులు ఆదాయపన్ను చెల్లించనవసరం లేదనీ, వారి ఆదాయపన్ను రద్దు చేస్తున్నాననీ ప్రకటించారు. అయితే అందువల్ల ఉత్పన్నమయ్యే ఆర్థిక లోటును భర్తీ చేయడానికి ఆయన ఎంచుకున్న మార్గమే.. ఇతర దేశాలు అనివార్యంగా అమెరికాకు దూరం జరగక తప్పని పరిస్థితిలోకి వాటిని నెట్టేస్తున్నది. ఇంతకీ ఆ అమెరికన్లకు ఆదాయపన్ను రద్దు చేసి.. ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు ట్రంప్ తీసుకున్న నిర్ణయమేంటంటే ఇతర దేశాలపై భారీగా సుంకం వసూలు చేయాలని. అమెరిభారత్‌పై సుంకాల యుద్ధానికి దిగిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, దాయాది దేశం పాకిస్థాన్‌తో మాత్రం వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా పాక్‌లో భారీ చమురు నిక్షేపాల వెలికితీతలో అమెరికా సాయపడుతుందని తెలిపారు. భారత నుంచి చేసుకునే దిగుమతులపై 25శాతం సుంకం ప్రకటిస్తూ డెడ్? ఎకానమీగా అభివర్ణించారు ట్రంప్?. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తాను లెక్కచేయ బోనని అంటూనే మన దాయాదితో ఒప్పందంచేసుకున్నారు. ఈ క్రమంలో అసలు పాక్?తో డీల్ వెనుక అమెరికా వ్యూహం ఏంటి? చైనా, భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలపై ఈ ఒప్పందం ప్రభావం ఉంటుందా? అసలు పాక్?లో ఉన్న ఆయిల్ నిల్వలు ఎంత? ఈ డీల్?తో భారత్ నష్టపోతుందపాకిస్థాన్?తో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్న తర్వాత ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో భారత్?కు పాక్ చమురు విక్రయించొచ్చుని అన్నారు. అయితే పాక్ గురించి ట్రంప్ ఎంత గొప్పగా మాట్లాడినా వాస్తవ పరిస్థితులు వేరేలా ఉన్నాయి. పాకిస్థాన్ వద్ద అంతగా చమురు నిల్వలు లేవు. యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఈఐఏ), వరల్డ్ మీటర్ డేటా ప్రకారం 2016 నాటికి పాకిస్థాన్ వద్ద 353.5 మిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు ఉన్నాయి. చమురు నిల్వలు ఎక్కువ కలిగి ఉన్న దేశాల్లో పాక్?ది 52వ స్థానం. ప్రపంచంలోని మొత్తం నిల్వలలో కేవలం 0.021శాతం చమురునే దాయాది దేశం కలిగి ఉంది.ప్రస్తుతం పాక్?కు రోజుకు దాదాపు 5,56,000 బ్యారెళ్ల చమురు అవసరం. అయితే పాకిస్థాన్ రోజువారీ చమురు ఉత్పత్తి దాదాపు 88,000 బ్యారెళ్లు. ఇది జాతీయ వినియోగం కంటే చాలా తక్కువ. దీంతో దాదాపు 85శాతం చమురును పాక్ దిగుమతి చేసుకుంటోంది. అయితే పాక్?లోని సింధూ బేసిన్‌లో ఇటీవలే భౌగోళిక సర్వే జరిగింది. అక్కడి నీటి అడుగున చమురు, గ్యాస్ నిల్వలను గుర్తించినట్లు తెలుస్తోంది. ఒకవేళ అక్కడి చమురు వెలికితీస్తే వెనిజులా, సౌదీ అరేబియా, ఇరాన్ తర్వాత ప్రపంచంలోని ఎక్కువ చమురు నిల్వలు ఉన్న దేశంగా పాక్ ఉండొచ్చని సమాచారం. అందుకే ట్రంప్ దాయాది దేశంతో డీల్ కుదుర్చుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.యూఎస్– పాక్ ఒప్పందం కుదరడానికి బీజం ఈ ఏడాది జూన్?లోనే పడింది. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్?ను ట్రంప్ విందుకు ఆహ్వానించారు. అలాగే 2025 జులై 26న పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ కూడా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోను కలిశారు. దీంతో నెల రోజుల క్రితమే యూఎస్– పాక్ ట్రేడ్ డీల్?కు బీజం పడిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే పాకిస్థాన్?తో ఈ చమురు ఒప్పందాన్ని ట్రంప్ కుదుర్చుకోవడం వెనుక చాలా కారణాలు ఉన్నాయి. ఎందుకంటే ట్రంప్ ఏదైనా దేశంతో అంత ఈజీగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోరు.

# ఆ అణుబాంబును పేల్చనివ్వండి

ఇంటర్నెట్‌డెస్క్: ఎన్నికల సంఘం, భాజపాపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన తీవ్రవ్యాఖ్యలపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ఆ అణుబాంబును పేల్చనివ్వండని వ్యాఖ్యానించారు. "తనవద్ద అణుబాంబు ఉందని రాహుల్ గాంధీ అన్నారు. అయితే ఆయన దానిని వెంటనే పేల్చాలి. అది పేలేటప్పుడు దానివల్ల తనకు హాని కలగకుండా చూసుకోవాలి. గతంలో భూకంపం అంటూ హెచ్చరికలు చేశారు. కానీ తర్వాత అది తుస్సుమంది" అని కౌంటర్ ఇచ్చారు. రాజ్యాంగబద్ధమైన సంస్థ (ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి)పై ఇలాంటి ప్రకటనలు చేయడం ప్రతిపక్ష నేతకు తగదని మండిపడ్డారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. అనంతరం ముసాయిదా ఓటరు జాబితాను ఈసీ నేడు విడుదల చేసింది. అయితే, ఈ ప్రక్రియను ముందు నుంచీ వ్యతిరేకిస్తోన్న కాంగ్రెస్ ఎంపీ



రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్ర స్థాయి నుంచి ఓట్ల చౌర్యం జరుగుతోందని మేం ఎప్పటినుంచో అనుమానిస్తున్నాం. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతో పాటు లోక్‌సభలో ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయి. ఓటరు సవరణ చేపట్టి కోట్లాది మంది కొత్త ఓటర్లను అదనంగా చేరుస్తున్నారు. దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేస్తే.. ఈసీ గురించి బయటపడింది. ఆరు నెలల పాటు మేం సొంతంగా దర్యాప్తు జరిపి ఆటం బాంబు లాంటి ఆధారాలను గుర్తించాం. ఆ బాంబు పేలిన రోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి అవకాశమే ఉండదు" అని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. మరో సందర్భంలో దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని రాహుల్ అన్నారు. ఎన్నికల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తక్కువ మెజారిటీతో మూడోసారి ప్రధానిగా గెలుపొందారని అన్నారు. మరో 15 సీట్లు రాకపోయుంటే మోదీ ప్రధాని కాకపోయేవారని పేర్కొన్నారు. భాజపాకు ప్రయోజనం చేకూర్చడానికి ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంలో పాలుపంచుకుందని ఆరోపించారు. 2014 నుంచి ఏదో తప్పు జరుగుతోందని తనకు అనిపిస్తోందని.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

# దేవగౌడ మనవడికి జీవితఖైదు

**బెంగళూరు:** లైంగిక దాడి కేసులో కర్ణాటక మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు పడింది. పని మనిషిపై అత్యాచార కేసులో బెంగళూరు ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే. ఈ కేసులో శనివారం శిక్షను ఖరారు చేసింది. ప్రజ్వల్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 5 లక్షలు జరిమానాను కోర్టు విధించింది. అలాగే.. బాధితురాలికి రూ.7 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. అత్యాచారం చేసి బెదిరించాడని గతేడాది మహిళ ఫిర్యాదు చేసింది. 26 మంది సాక్షులను విచారించిన కోర్టు తీర్పు వెల్లడించింది. ప్రజ్వల్ రేవణ్ణ మాజీ ప్రధాని దేవగౌడ మనవడు. మాజీ మంత్రి రేవణ్ణ తనయుడు. 2019లో హసన్ నుంచి జేడీఎస్ తరఫున లోక్‌సభ ఎంపీగా నెగ్గారు. కిందటి ఏడాది లోక్‌సభ ఎన్నికల ముందు వెలుగు చూసిన హసన్ సెక్స్ స్కాండల్ దేశవ్యాప్తంగా దుమారం రేపింది. 2021 కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో తన ఫామ్‌హౌజ్‌లో పని చేసే మహిళపై(48) మూడుసార్లు



అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆ ఘాతుకాన్ని వీడియో తీసి ఆమెను బెదిరించాడన్నది ఈ కేసు. ప్రజ్వల్ రేవణ్ణ.. మాజీ ప్రధాని దేవగౌడ మనవడు. మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ తనయుడు. 2015లో జేడీఎస్‌లో చేరి.. 2019 ఎన్నికల్లో హసన్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. ఆ దఫా పార్లమెంట్‌లో.. మూడో అత్యంత పిన్నవయసున్న ఎంపీగా ఘనత సాధించాడు. అయితే 2023లో అఫిడవిట్‌లో లోపాల కారణంగా(రూ.24 కోట్ల లెక్కను చూపించకపోవడం) కర్ణాటక హైకోర్టు ఆయన ఎంపీ ఎన్నికల చెల్లదంటూ తీర్పు ఇచ్చింది. లైంగిక దాడి కేసు నేపథ్యంలో జేడీఎస్ ఆయన్ని సస్పెండ్ చేసింది. పని మనిషిపై అత్యాచారం ఘటన మాత్రమే కాదు.. ప్రజ్వల్‌పై అశ్లీల వీడియోల కేసులు నమోదు అయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ వీడియోలు వెలుగులోకి రావడం కలకలం రేపింది. హసన్‌లోని ఫామ్‌హౌజ్ నుంచి 2,900 వీడియోలు ఉన్న పెన్‌డ్రైవ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోవడం తీవ్రకలకలం రేపింది. ఇందుకుగానూ ప్రజ్వల్‌పై మూడు కేసులు నమోదు కాగా.. వాటిని సీఐడీ ఆధ్వర్యంలో సిట్ విచారణ జరుపుతోంది. ఇందులో స్వయంగా ప్రజ్వల్ చాలావరకు వీడియోలను చిత్రీకరించినట్లు అభియోగాల్లో దర్యాప్తు అధికారులు పేర్కొనడం గమనార్హం.

# నేను రాజును కాను.. కావాలనుకోవడం లేదు..

కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శనివారం యాన్యువల్ లీగల్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. రాహుల్ ప్రసంగం సభలో ఆయన మద్దతుదారులు నినదించారు. 'ఇస్ దేశ్ కా రాజా కైసా హెూ.. రాహుల్ గాంధీ జైసా హెూ' అని పలువురు నినదించగా దానికి రాహుల్ గాంధీ స్పందిస్తూ.. తాను రాజును కాదని.. కావాలని అనుకోవడం లేదన్నారు. అయినా పలువురు అలాగే నినాదాలు చేశారు. తాను రాజుగా మారాలని కూడా కోరుకోవడం లేదని.. తాను రాజును వ్యతిరేకిస్తున్నానని.. నేను ఆ భావనకు కూడా వ్యతిరేకినన్నారు. రాహుల్ గాంధీ గతంలో ప్రధానిని ఉద్దేశించి 'రాజు'గా అభివర్ణిస్తూ ప్రజల గొంతుక వినడం లేదంటూ ఆరోపించారు.
'రాజ్యాంగ సవాళ్లు : దృక్కోణాలు, మార్గాలు' అనే థీమ్ వనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో లీగల్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘంపై మరోసారి విమర్శలు గుప్పించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందని మండిపడ్డారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని.. దాదాపు 70 నుంచి వంద స్థానాల్లో రిగ్గింగ్ జరిగి ఉండవచ్చన్నారు.



ఒకవేళ 15 సీట్లలోనే రిగ్గింగ్ జరిగి ఉంటే మోదీకి ప్రధానిగా అవకాశమే లభించేది కాదన్నారు. స్వల్ప మెజారిటీతో మోదీ ప్రధాని పీఠాన్ని అలంకరించారన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇంకా తక్కువగా సీట్లు వచ్చి ఉంటే ఆయన ప్రధాని పీఠం వరకు వెళ్లేవారు కాదన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని ఒక అసెంబ్లీ స్థానంలో ఉన్న ఓటర్ల ఫొటోలు, పేర్లను తమ పార్టీ తనిఖీ చేయగా మొత్తం 6.5 లక్షల ఓటర్లలోని 1.5 లక్షలలో ఓటర్లు నకిలీయేనని తేలిందని రాహుల్ తెలిపారు. ఈ సమాచారాన్ని కాంగ్రెస్ విడుదల చేశాక ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు రావడాన్ని అందరూ చూస్తారన్నారు. ఆటం బాంబులా కుదిపేస్తుందన్న ఆయన.. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కొందరి హస్తాల్లోకి వెళ్లిపోయిందని, దాని ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. గతంలో తగిన సాక్ష్యాధారాలు లేక ఈ అంశంపై మాట్లాడలేకపోయేవాడినన్నారు. తమ చేతిలో ప్రస్తుతం వందశాతం సాక్ష్యాలు ఉన్నాయని.. అదే ధీమాతో ప్రస్తుతం మాట్లాడుతున్నానన్నారు. తాను లోక్‌సభ ఎన్నికల రిగ్గింగ్‌కు సంబంధించిన ఆధారాలను చూపిస్తే, కొందరు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారని.. అదెలా సాధ్యమైందని ప్రశ్నిస్తున్నారన్నారు. కానీ, అది సాధ్యమేనని.. నిజంగానే జరుగుతోందన్నారు. 2014 నుంచే తనకు అనుమానంగా ఉందన్నారు. అప్పటి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల విషయంలోనూ సందేహాలు ఉన్నాయన్నారు. పూర్తిగా మెజారిటీతో కొందరికి వచ్చినా ఏకపక్ష విజయాలు తనలో అనుమానాలు పెంచాయన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లోనైతే కాంగ్రెస్‌కు ఒక్క లోక్‌సభ సీటు రాలేదని.. ఆయా ఆ ఫలితాలు తనను ఆశ్చర్యపరిచాయన్నారు.

## 'ఆపరేషన్ అఖల్'లో ఉగ్రవాది హతం



**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాక్ ఉగ్రవాదల ఏరివేతకు భారత్ నడుంబిగించింది. తాజాగా కుల్గామ్ జిల్లాలో ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది మృతి చెందాడని రక్షణశాఖ అధికారులు తెలిపారు. ఉగ్రవాదులకు సంబంధించి అందిన నిఘా వర్గాల సమాచారం ఆధారంగా దక్షిణ కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలోని అఖల్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ నేపథ్యంలోనే ఒక ఉగ్రవాది హతమయ్యాడని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. రాత్రిపూట అడపాదడపా కాల్పులు కొనసాగాయని, అప్రమత్తమైన దళాలు దాడులను కొనసాగిస్తూ, ఉగ్రవాదులకు ఉచ్చు బిగించాయి. ఇప్పటివరకు భద్రతా దళాలు ఒక ఉగ్రవాదిని మట్టుబెట్టాయని భారత సైన్యంలోని చినార్ కార్ప్స్ 'ఆపరేషన్ అఖల్'కు సంబంధించిన తాజా విజయాన్ని వెల్లడించింది. కుల్గామ్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల ఉనికికి సంబంధించిన నిఘా సమాచారం అందిన వెంటనే భద్రతా దళాలు తమ ఆపరేషన్ ప్రారంభించాయి. అడవుల్లో దాక్కున్న ఉగ్రవాదులపై కాల్పులు జరిపాయి. జమ్మూలోని పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) సమీపంలో దీనికి ముందు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు చొరబాటు యత్నంలో హతమయ్యారు. ఈ ఘటన అనంతరం దేగ్వార్ సెక్టార్‌లోని కల్సియన్-గుల్పూర్ ప్రాంతంలో తాజా ఆపరేషన్ ప్రారంభమైంది. 'ఆపరేషన్ మహాదేవ్'లో భారత సైనిక దళాలు జూలై 28న శ్రీనగర్ శివార్లలోని హర్వాన్ సమీపంలోని లిద్వాస్ అడవిలో ముగ్గురు పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టాయి.

## పారిశ్రామికవేత్తలపై దాదాగిరి.. అభివృద్ధికి అడ్డంకిగా మారుతోంది: సీఎం ఫడ్నవీస్



ముంబై: మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పారిశ్రామికవేత్తలపై దాదాగిరి పెరుగుతున్నదని అన్నారు. దీంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతున్నదని ఆరోపించారు. పూణే మెట్రోపాలిటన్ రీజియన్ గ్రోత్ హబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడారు. పుణే అభివృద్ధికి 'దాదాగిరి' అతిపెద్ద అడ్డంకి అని అన్నారు. పరిశ్రమలపై ఒత్తిడి తీసుకురావడానికి లేదా కాంట్రాక్టులు ఇవ్వడానికి కొన్ని శక్తులు దాదాగిరి, బెదిరింపు వంటి చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. 'నేడు, కొంతమంది తాము సిఫార్సు చేసిన అభ్యర్థులను నియమించుకోవాలని, తమ నుంచి ముడి పదార్థాలను కొనుగోలు చేయాలని, తమ వారికి మాత్రమే కాంట్రాక్టులను కేటాయించాలని పరిశ్రమలపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ రకమైన జోక్యం పూణే పురోగతికి ప్రధాన అడ్డంకిగా మారింది' అని అన్నారు. కాగా, ఈ బెదిరింపు మనస్తత్వాన్ని నిర్మూలించకపోతే, మహారాష్ట్రలో రెండవ అతిపెద్ద నగరం, దేశంలోని ప్రధాన ఆర్థిక కేంద్రాలలో ఒకటైన పూణే దాని నిజమైన అభివృద్ధి సామర్థ్యాన్ని సాధించలేదని ఫడ్నవీస్ తెలిపారు. పెట్టుబడిదారుల స్వేచ్ఛ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ప్రభుత్వ స్థాయిలో ఇబ్బంది లేని వాతావరణాన్ని నిర్ధారించడం సరిపోదని అన్నారు. విస్తృత సామాజిక, రాజకీయ, పర్యావరణ వ్యవస్థలన్నీ వ్యాపారాలకు అనుకూలంగా ఉండాలని స్పష్టం చేశారు. అయితే స్థానికంగా రాజకీయ బలం ఉన్న ఏక్‌నాథ్ షిండే శివసేన వర్గం లేదా ఎంఎన్‌ఎస్ దాడుల గురించి ఫడ్నవీస్ ఈ వ్యాఖ్యలు చేశారా అన్నది అర్థం కాలేదు.

## 8 పెళ్లిళ్లు పూర్తి... 9 మ్యారేజ్ బ్రేక్

**ముంబై :** పెళ్లికాని దనవంతులే ఆమె టార్గెట్, మ్యాట్రిమోనీ, షాదీడాట్‌కామ్ వంటి వెబ్‌సైట్ల నుంచి ధనికులైన పెళ్లికాని వ్యక్తుల వివరాలు సేకరించి వాళ్లకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో రిక్వెస్ట్‌లు పెట్టి వారితో పరిచయం పెంచుకుంటుంది. అలా వాళ్లతో మెల్లగా మాటలు కలిపి తన మాయలోకి దించుతుంది. కొన్ని సమస్యల కారణంగా తన భర్తలో విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని, తన కు ఒక బిడ్డ ఉందని చెప్పి వాళ్లకు మానసికంగా దగ్గరవుతుంది. ఇలానే వాళ్లను ప్రేమలోకి దించి దాన్ని పెళ్లి వరకు తీసుకెళ్తుంది. ఇలానే దాదాపు 8 మందిని పెళ్లాడింది. తొమ్మిదో పెళ్లి కోసం సిద్ధమవుతూ పోలీసులకు చిక్కింది. ఈ ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్‌కు చెందిన సమీరా ఫాతిమా అనే ఈ మహిళ మొదట్లో ఉపాధ్యాయిగా పనిచేస్తూ జీవనం సాగించేది. ఈజీ మనీ ఫాస్ట్ లైఫ్‌కు అలవాటు పడిన ఈమే సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించేందుకు ఈ అక్రమ మార్గాలను ఎంచుకుంది. అనుకున్న ప్రకారం పెళ్లికాని ధనవంతులకు వలవేసి వాళ్లను పెళ్లి చేసుకొని కొన్ని రోజులు కాపురం చేశాక.. పథకం ప్రకారం తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తుంది. అందుకు పెళ్లి చేసుకున్న వ్యక్తులు నిరాకరిస్తే వాళ్లను బెదిరించేందుకు ఈమెకు ఒక గ్యాంగ్ కూడా ఉంది. ఇలా ఇప్పటి వరకు సుమారు 8 మందిని పెళ్లాడి వాళ్ల నుంచి డబ్బులు కాజేసింది.అయితే ఇలా మోసపోయిన ఆమె మాజీ భర్త ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదురు మహిళ తన నుంచి రూ.50లక్షలు బెదిరించి బలవంతంగా వసూలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల దర్యాప్తులో ఆమె అసలు భాగోతం బయటపడింది. దీంతో ఈ గత జులై 29వ తేదీన ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు.

## ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా...

**లక్నో :** భారత ఆర్థిక వ్యవస్థ 'చచ్చిపోయింది' (డెడ్ ఎకానమీ) అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తీవ్ర విమర్శలపై ప్రధాని నరేంద్ర మోదీ గట్టిగా బదులిచ్చారు. భారత్ త్వరలోనే ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించబోతోందని, విమర్శలకు గణాంకాలే సమాధానం చెబుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం భారత, అంతర్జాతీయ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.ఇటీవల ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటనలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ విషయంపై స్పందించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. "భారత్ సాధిస్తున్న వృద్ధి, ప్రగతి ఫలాలు దేశంలోని నిరుపేదలకు, అట్టడుగు వర్గాలకు సైతం అందుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దీనికి నిదర్శనం" అని మోదీ పేర్కొన్నారు.ప్రధాని మోదీ వ్యాఖ్యలకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నివేదికలు కూడా బలం చేకూరుస్తున్నాయి. ప్రముఖ సంస్థ మోర్గాన్ స్టాన్లీ 2025లో విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2028 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని అంచనా వేసింది. గతంలో ఘనా వంటి దేశాల్లో పర్యటించినప్పుడు కూడా మోదీ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా దాదాపు 16 శాతంగా ఉందని, స్టార్టప్ వ్యవస్థలో ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచిందని ఆయన గుర్తుచేశారు. యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) వంటి డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలు కేవలం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు తెచ్చాయని వివరించారు. ఆత్మనిర్భర్ భారత్, దేశీయ తయారీకి ప్రోత్సాహకాలు, డిజిటల్ మౌలిక వసతుల బలోపేతం వంటి ప్రభుత్వ విధానాలు ఈ ఆర్థిక ప్రగతికి పునాదులు వేశాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాలను అధిగమించి భారత్ ముందుకు సాగుతున్న తరుణంలో ట్రంప్ వంటి విమర్శకులకు ప్రధాని మోదీ గణాంకాలతోనే సమాధానం ఇచ్చారు.ఖ

## మహాదేవుని ఆశీస్సులతో 'పహల్గామ్'పై ప్రతీకారం

**వారణాసి:** 'ఆ మహాదేవుని ఆశీస్సులతో పహల్గామ్ దాడిపై ప్రతీకారం తీర్చుకున్నాం. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని మహాశివుని పాదాలకు అంకితమిస్తున్నాను' అని ప్రధాని మోదీ వారణాసి పర్యటనలో పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యాటకం,



పట్టణాభివృద్ధి, సాంస్కృతిక వారసత్వం తదితర కీలక రంగాల విస్తరణకు ఉద్దేశించిన ప్రాజెక్టులను యూపీలోని వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రదాని మోదీ వారణాసిలో అడుగుపెట్టారు. అనంతరం దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారి కాశీకి వచ్చాను. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్‌లో ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు దారుణంగా హత్యకు గురయ్యారు. బాధిత కుటుంబాల వేదన నా హృదయాన్ని ద్రవింపజేసింది. బాధిత కుటుంబాలకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని నేను కాశీ విశ్వనాథుణ్ణి ప్రార్థించాను' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని.. కిసాన్ సమ్మాన్ నిధి 20వ వాయిదాను 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు. దాదాపు రూ.2200 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. అంతకు ముందు ఉత్తరప్రదేశ్ చేరుకున్న ప్రధాని మోదీని సీఎం యోగి ఆదిత్యనాథ్ సత్కరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పదవిలో ఉంటూ వారణాసిని 51వ సారి సందర్శించారు. ఆయన నగరంలో దాదాపు మూడు గంటల పాటు ఉండనున్నారు. కిసాన్ నిధిని ప్రదాని మోదీ వారణాసి నుండి రైతులకు పంపిణీ చేయడం ఇది రెండవసారి. ఈరోజు ప్రధాని మోదీ రామ్‌కుండ్, మందాకిని, శంకుల్ధార, ఇతర ప్రాంతాలతో సహా వివిధ కుండ్‌లలో నీటి శుద్ధి, నిర్వహణ పనులకు పునాది రాయి వేయనున్నారు. జల్ జీవన్ మిషన్ కింద 47 గ్రామీణ తాగునీటి పథకాలను ప్రారంభించనున్నారు. 'కాశీ సంసద్ ప్రతియోగిత' కింద స్కెచింగ్ పోటీ, పెయింటింగ్ పోటీ, ఫోటోగ్రఫీ పోటీ పోటీల కోసం రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను కూడా ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. పండిట్ మదన్ మోహన్ మాలవ్య క్యాన్సర్ సెంటర్, హెూమి భాభా క్యాన్సర్ హాస్పిటల్‌లో రోబోటిక్ సర్జరీ సెంటర్‌లకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రధాని మోదీ ఈ పర్యటనకు ముందు ట్విట్టర్‌లో 'ఆగస్టు 2వ తేదీ కాశీలోని నా కుటుంబ సభ్యులకు చాలా ప్రత్యేకమైన రోజు. రేపు ఉదయం 11 గంటలకు, విద్య, ఆరోగ్యం, క్రీడలు, పర్యాటకం, కనెక్టివిటీకి సంబంధించిన పలు ప్రాజెక్టులను ప్రారంభించనున్నాను. అలాగే పీఎం పీఎం కిసాన్ పథకం 20వ విడత నిధులను విడుదల చేయనున్నాను' అని పేర్కొన్నారు.

## అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత..

రుతుపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జమ్ము కశ్మీర్‌లోనూ కుండపోత వర్షాలతో పలు నదులు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ వర్షాలకు అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్ పడింది. కశ్మీర్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను ఆగస్టు 3 వరకూ నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కశ్మీర్ డివిజనల్ కమిషనర్ విజయ్ కుమార్ బిధురి శుక్రవారం ప్రకటించారు. పహల్గాం, బల్తాల్ ఉంగా భక్తులను అనుమతించట్లేదని వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారికి నిర్వహణ అవసరం కావడంతో ఆ మార్గాన్ని మూసివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది జులై 2న ప్రారంభమైన ఈ యాత్ర 38 రోజులపాటు సాగనుంది. ఆగస్టు 9న శ్రావణ పూర్ణిమ రోజున ముగియనుంది. యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ 4.10 లక్షల మంది మంచు లింగాన్ని దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఏడాది దాదాపు 5 లక్షల మందికిపైగా భక్తులు మంచు లింగాన్ని దర్శించుకోనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# రాహుల్‌ని ప్రధానిగా చేసి చూపిస్తాం

-మొదటిపేజీ తరువాయి

కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అమరులయ్యారు. యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు. కానీ, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారు

**రాహుల్ కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు**

2004లోనే రాహుల్‌గాంధీ కేంద్ర మంత్రి అయ్యేవారు. ఆయన కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు. కానీ ప్రధాని, కేంద్ర మంత్రి పదవులు పార్టీ సీనియర్ నేతలకు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు. సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయిననప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంఘ్ పరివార్ మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది. కానీ అందుకు ఆయన రాజీ పడలేదు. 75 ఏళ్లు దాటిన వ్యక్తులు కుర్చీ వీడాలని మోహన్ భాగవత్ చెప్పారు. కానీ 75 ఏళ్లు దాటినా.. మోదీ అందుకు సిద్ధంగా లేదు. ఇదే నిబంధనతో అద్వాణీ, మనోహర్ జోషిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు గతంలో వాజ్‌పేయి, ప్రధాని పదవి నుంచి తప్పించేందుకు మోహన్ భాగవత్ ప్రయత్నించారు. ఆయన్ను తప్పించడం వారి వల్ల కాలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాడతారు. భాజపాకు 150 సీట్లు దాటకుండా చూస్తాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు

రాహూల్‌ని ప్రధానిగా చేసి చూపిస్తాం

రాహుల్ గాంధీ గారిని భారత ప్రధాని చేయాలన్న లక్ష్యంతో, ఈ దేశాన్ని సామాజిక న్యాయ మార్గంలో నడిపించాలన్న సంకల్పంతో, మేమంతా సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రారంభమైన పార్టీ కాంగ్రెస్? ఈరోజు ఈ దేశంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇతర అన్ని రాజకీయ పార్టీలు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాతే ప్రారంభమయ్యాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ప్రారంభమైన పార్టీ. ఈ దేశానికి స్వాతంత్ర్యం అందించిన పార్టీ కాంగ్రెస్. ఇతర రాజకీయ పార్టీలలా కాదు. ఇతర రాజకీయ పార్టీలు ఎన్నికలొస్తే పోటీ చేయడం, గెలిస్తే పదవిలో కూర్చోవడం, ఓడిపోతే ఇంట్లో కూర్చోవడం అలవాటైపోయిందన్నారు. బీజేపీ నుంచి మొదలుకొని చాలా విపక్ష పార్టీలు ఇలాగే వ్యవహరిస్తున్నాయి. ఓడిపోయాక ప్రజల మధ్యకు రావడం లేదు?. గెలిచినప్పుడే కనిపిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం నిత్యం ప్రజల మధ్య ఉండి, ప్రజల కోసం పని చేసే రాజకీయ పార్టీగా నిలుస్తోందన్నారు. ఈ రోజు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ రిజర్వేషన్లు రద్దు చేయాలనే ప్రయత్నం చేస్తోంది. గత 11 ఏళ్లుగా సామాజిక న్యాయం గురించి కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించలేదన్నారు. కొందరు బీజేపీ నాయకులు తరచూ మాట్లాడుతుంటారు. "కాంగ్రెస్ పార్టీ చేసిందేమిటి?" నేను ఈ బీజేపీ నాయకులకు గుర్తు చేయాలనుకుంటున్నా? కాంగ్రెస్ పార్టీ పోరాటం ద్వారానే 41 కోట్ల భారతీయుల స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. దేశం ఒకప్పుడు ఉగ్రవాద ప్రమాదాల్లో చిక్కినప్పుడు, పక్కనున్న పాకిస్తాన్ నుండి ముప్పు వచ్చినప్పుడు, ఇందిరా గాంధీ ధైర్యంగా యుద్ధాన్ని ప్రకటించారన్నారు. పాకిస్తాన్‌ను ఓడించి, ఆ దేశాన్ని రెండు భాగాలుగా విడదీసి, ఆ యుద్ధాన్ని జయించి, కాళీమాత గౌరవాన్ని నిలబెట్టారు. మూడోసారి ఉగ్రవాదుల చేతిలో దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు, రాజీవ్ గాంధీ గారు తన ప్రాణాలను త్యాగం చేసి, దేశాన్ని రక్షించారన్నారు. అయినా కూడా "గాంధీ కుటుంబం దేశం కోసం ఏం చేసింది?" అన్న ప్రశ్నను ఎప్పుడూ లేపుతూనే ఉంటారని విమర్శించారు. ఈ దేశం కోసం మహాత్మా గాంధీ గారు, ఇందిరా గాంధీ గారు, రాజీవ్ గాంధీ గారు ప్రాణత్యాగం చేశారు. ప్రధాని పదవిని త్యాగం చేసి ఆర్థిక నిపుణుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ గారిని భారత ప్రధాని చేయడం ద్వారా ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా భారత్ ఎదగడంలో సహకారాన్ని సోనియా అందించారన్నారు. తర్వాత రాష్ట్రపతి పదవిని చేపట్టే అవకాశం వచ్చినప్పటికీ సోనియా గాంధీ గారు దాన్నీ తిరస్కరించారు. , రాహుల్ గాంధీ గారి గురించి బీజేపీ నాయకులు ఎన్నో మాటలు మాట్లాడుతున్నారు. కానీ ఆయన చేసిన త్యాగం వాళ్లకు అర్థం కాదన్నారు. రాహుల్ గాంధీ కావాలనుకుంటే 2009 లోనే కేంద్ర మంత్రి అయి ఉండేవారు. ప్రధాని కూడా అయి ఉండేవారు. కానీ వారు ఆ పదవులకు దూరంగా ఉన్నారన్నారు. ఆ అవకాశాన్ని పార్టీ పెద్దలకి ఇచ్చి, తాను మాత్రం కేవలం ఒక కార్యకర్తగా ప్రజల కోసం పనిచేస్తున్నారు.

**పదవిని వదలడానికి సిద్ధంగా లేని మోదీ**

నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఈ రోజు వరకూ, బీజేపీ నేతలు, ఆర్ఎస్ఎస్ కుటుంబం కూడా పదవి నుంచి మోదీ ని తప్పించడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ మోదీ గారు పదవిని వదలడానికి ఏ సందర్భంలోనూ సిద్ధంగా లేరన్నారు. రెండు నెలల క్రితం నేను మోహన్ భగవత్ ..75 ఏళ్లు దాటిన వారు రిటైర్ కావాలన్నారు. మోదీ మాత్రం తన పదవిని వదిలి కొత్తవారికి అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు. మోదీ ని గద్దె దించడమే రాహుల్ గాంధీ లక్ష్యం. ఇది రాబోయే ఎన్నికల్లో జరగబోతోందన్నారు. సంఘ్ కుటుంబం చేయలేకపోయిన పనిని, అటల్ బిహారీ వాజ్‌పేయి చేయలేకపోయిన పనిని, రాహుల్ గాంధీ చేసి చూపిస్తారన్నారు రాహుల్ గాంధీ నేతృత్వంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీకి 150 సీట్లు దాటకుండా తగిన గుణపాఠం చెప్పే బాధ్యతను మేము తీసుకుంటామని ప్రకటించారు.

# రైతును రారాజును చేయడమే మోదీ లక్ష్యం!!

-మొదటిపేజీ తరువాయి

కనీస మద్దతు ధర అందించేందుకు రూ.16 లక్షల 35 వేల కోట్లు ఖర్చు చేసిన మోదీ సర్కార్.కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రైతుల ఖాతాల్లో రూ.3 లక్షల 69 వేల 561 కోట్లు జమ..టెన్త్ బాగా చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు స్కూటీ ఇచ్చేందుకు యత్నిస్తాసైకిళ్ల పంపిణీకి దేశవ్యాప్త ప్రచారం లభిస్తోంది. దేశంలోని ఎంపీలంతా సైకిళ్ల పంపిణీ గురించి వాకబు చేస్తున్నారుప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి మరింత కృషి చేస్తా. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. చొప్పదండిలో పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి.ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గత 11 ఏళ్లలో రైతుల సంక్షేమం, వ్యవసాయం, అనుబంధ రంగాలకు దాదాపు రూ.71 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత మోదీ సర్కార్ కే దక్కిందన్నారు. రైతును రారాజు చేయడమే లక్ష్యంగా నరేంద్రమోదీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే కిసాన్ సమ్మాన్ నిధి పేరిట గత 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా 9 కోట్ల 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3.89 లక్షల కోట్లను జమ చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రములో ఇప్పటివరకు 30 లక్షల 80 వేల మందికిపైగా రైతుల ఖాతాల్లో రూ.13 వేల కోట్లు జమ చేసినట్లు వివరించారు. ప్రధానమంత్రి కిసాన్ ఉత్సవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కిసాన్ ఉత్సవ్



దివస్ కార్యక్రమంలో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి నుంచిప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రసంగాన్ని వర్చువల్ గా బండి సంజయ్ తిలకించారు. అనంతరం మోదీ బటన్ నొక్కి20వ విడత కిసాన్ సమ్మాన్ నిధులను దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడారు.కరీంనగర్ జిల్లాలో లక్షా 81 వేల 305 మంది రైతుల ఖాతాల్లో రూ.36 కోట్ల 26 లక్షల 10 వేలను.. ఒక్క చొప్పదండి మండలంలోనే 4 వేల 612 మంది రైతుల అకౌంట్లలో రూ.92 లక్షల 24 వేలను జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈరోజు కాశీ విశ్వనాథుడి ప్రసాదంగా కిసాన్ సమ్మాన్ నిధి సొమ్మును రైతులకు అందజేయడం గొప్ప కార్యక్రమం. ప్రపంచంలోనే ఇంత పెద్ద గొప్ప స్కీం మరొకటి లేదు. దళారులు, పైరవీలతో పనిలేకుండా నేరుగా ఏటా రూ.6 వేలను మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొలిసారి 2019 ఫిబ్రవరిలో ఈ మహోత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామని.. అప్పటినుంచి ఇప్పటివరకు ఇబ్బందులు ఎదురైనా క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధులను జమ చేస్తున్నట్లు వివరించారు. ఐదేళ్లలో 19వ విడతలుగా ఈ స్కీం కింద రూ.3 లక్షల 69 వేల 561 కోట్లను రైతుల అకౌంట్లలో జమ చేశామని.. 20వ విడత కింద ఈరోజు మరో 20 వేల 834 కోట్ల రూపాయలను 9 కోట్ల 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. గత 19 దఫాలుగా ఒక్క తెలంగాణ రైతాంగానికి 13 వేల 8 కోట్ల 29 లక్షల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈరోజు మరో రూ.620 కోట్లను జమ చేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికలు, ఓట్లతో సంబంధం లేకుండా రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని అన్నారు. రష్యా ,ఉక్రెయిన్ యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాల కారణంగాఅంతర్జాతీయ మార్కెట్లలో యూరియా ధరలు పెరిగినా.. మన దేశ రైతులపై భారం పడకుండా మోడీ ప్రభుత్వం తక్కువ ధరలకే ఎరువులు పంపిణీ చేస్తుందని గుర్తు చేశారు.ఎరువుల సబ్సిడీ పేరుతో ఒక్కో ఎకరాకు 18 వేల చొప్పున.. 5 ఎకరాలున్న రైతుకు ఒక్క సీజన్ కే 90 వేల రూపాయలు ఆదా అవుతున్నాయని పేర్కొన్నారు పంటలకు మద్దతు ధర అంది స్తున్నాం.మోదీ ప్రభుత్వం 11ఏళ్లలో వడ్లు, గోధుమలుసహా రైతులు పండించే పంటలన్నింటికీ కనీస మద్దతు ధర అందించేందుకు16 లక్షల 35 వేల కోట్లకు పైగా నిధులను ఖర్చు చేసింది. ఒక్క మన రాష్ట్రంలోనే వడ్ల కొనుగోలు కోసం లక్షన్నర కోట్ల రూపాయలకు పైగా మోదీ ప్రభుత్వం ఖర్చు చేసింది. యూపీఏ హయాంలో క్వింటాలు వడ్లకు కనీస మద్దతు ధర 1310 రూపాయలుంటే, మోదీ పాలనలో నేడు 2300 రూపాయలకు పైగా ఇస్తున్నామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రిని పలువురు సన్మానించారు అనంతరం పలువురు విద్యార్థులు కేంద్రమంత్రికి రాఖీలు కట్టారు.

# స్పాంజ్ పార్కుల ఆవశ్యకత..

**వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వరద నీరు వృథాగా పోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని అధికారులు వరదల నియంత్రణకు స్పాంజ్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని ముంపు సమస్య అధికంగా ఉండటంతో.. రహదారులు, లోతట్టు ప్రాంతాల్లోని వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రతిపాదనలు పంపినట్లు సీడీఎంఏ టీకే. శ్రీదేవి ఆదేశించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో.. వరద నీరు వృథాగా పోకుండా అధికారులు కీలక చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని అధికారులు వరదల నియంత్రణకు 'స్పాంజ్ పార్కులను' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ముంపు సమస్య ఎక్కువగా ఉన్నందున, రహదారులు, లోతట్టు ప్రాంతాల్లోని వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడానికి ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు సీడీఎంఏ టీకే. శ్రీదేవి ఆదేశాలు జారీ చేశారు.స్పాంజ్ పార్కులు అనే ఆలోచన చెన్నై నగరం నుంచి ప్రేరణ పొందింది. సుమారు 11 ఏళ్ల క్రితం చెన్నై నగరాన్ని వరదలు తీవ్రంగా ముంచెత్తాయి. రహదారులు, కాలనీలు, విమానాశ్రయం పూర్తిగా నీట మునిగి ఐదు, ఆరు రోజుల పాటు జనజీవనం స్తంభించింది. ఈ అనుభవం నుంచి పాఠాలు నేర్చుకొని, వరద ముంపును తగ్గించడానికి చెన్నైలో 57 స్పాంజ్ పార్కులను ప్రతిపాదించగా, ప్రస్తుతం 21




పార్కులు నిర్మాణ దశలో ఉన్నాయి.స్పాంజ్ పార్కులు అనేక ప్రయోజనాలను అందిస్తాయి.. వాటిలో వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా వరదల తీవ్రతను గణనీయంగా తగ్గిస్తాయి. ఈ పార్కులలో నిల్వ ఉన్న నీరు భూమిలోకి ఇంకి, భూగర్భ జలాల మట్టాన్ని పెంచుతుంది, తద్వారా వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని అధిగమించవచ్చు. ఈ పార్కులను పచ్చదనంతో నిండిన ప్రాంతాలుగా అభివృద్ధి చేయవచ్చు.. ఇది నగరంలో పచ్చదనాన్ని పెంచడానికి దోహదపడుతుంది. అంతే కాకుండా.. ఈ పార్కుల నిర్మాణం తక్కువ ఖర్చుతో కూడుకున్నది.. కానీ ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది. గ్రేటర్ వరంగల్ పరిధిలో 45 లోతట్టు ప్రాంతాలు.. అలాగే వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 25 ప్రధాన రహదారులకు తరచుగా వరద ముంపు సమస్య ఉంది. ఇలాంటి ప్రాంతాల్లోనే స్పాంజ్ పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకురాలు ఆదేశించారు. వరంగల్, హనుమకొండలోని కొన్ని కీలక ప్రాంతాలు, ఇక్కడ స్పాంజ్ పార్కులను ఏర్పాటు చేయాలని ఇంజినీర్లు సూచిస్తున్నారు. కాజీపేట ఎన్ఐటీ, హనుమకొండ వడ్డేపల్లి సెంటర్, అదాలత్ సెంటర్, నక్కలగుట్ట, కేయూసీ కూడలి, హనుమకొండ చౌరస్తా, అలంకార్, వరంగల్‌లో ములుగురోడ్, ఎంజీఎం సెంటర్, కాశీబుగ్గ, వరంగల్ అండర్‌బ్రిడ్జి, హంటర్‌రోడ్, పాపయ్యపేట వంటి ప్రాంతాల్లో వీటిని నిర్మించున్నట్లు తెలుస్తోంది. నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఇప్పటికే స్పాంజ్ పార్కు తరహాలో భారీ ఇంకుడు గుంత నిర్మాణం జరుగుతోంది. ఇది 9/5 అడుగుల పొడవు, 6/4 అడుగుల వెడల్పుతో 228 క్యూబిక్ మీటర్ల లోతు ఉంటుంది. ఇలాగే హసన్‌పర్తి, చింతగట్టు, టేకులగూడెం, తరాలపల్లి విలీన గ్రామాల్లో కూడా ఇలాంటి ప్రాజెక్టులు మొదలయ్యాయి. ఈ నమూనాను అనుసరించి, వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో స్పాంజ్ పార్కుల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. ఈ చర్యలతో వర్షాకాలంలో ప్రజలకు వరద కష్టాలు తీరుతాయని అధికారులు ఆశిస్తున్నారు.

## 50 ట్రిప్స్.. జీరో రిజల్ట్స్..!

-మొదటిపేజీ తరువాయి

తట్టుకుని పండించిన పంటలకు మార్కెట్లో మద్దతు ధర లేదు.. రైతులు పొలాల్లో జల్లడానికి యూరియా లేదు.. సాగునీళ్లు రావు.. తాగునీళ్లు లేవు.. కాళేశ్వరం ఎత్తిపోతల మరమ్మతు పనులు జరగకుండా అడ్డుకుంటూ తెలంగాణకు ద్రోహం చేస్తున్నామన్న సోయి లేదు. బనకచర్ల నిర్మాణంతో తెలంగాణ శాశ్వతంగా నష్టపోతుందన్న ఆలోచన లేదు అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.
రెండు లక్షల ఉద్యోగాల ఊసు లేదు.. జాబ్ క్యాలెండర్ల జాడ లేదు. రుణమాఫీ కాలేదు %-% రైతు భరోసా రాలేదు. తులం బంగారం ఊసు లేదు.. రూ.4 వేల ఫించన్ జాడ లేదు. గురుకులాల గోడు పట్టదు %-% గురుకుల విద్యార్థుల ఆకలి కేకలు వినపడడం లేదు. కానీ రేవంత్ రెడ్డి 3 రోజుల్లో 3 ఫ్లైట్‌లు ఎక్కుతున్నాడు.. దిగుతున్నాడు. "ఒక్కసారి కాదు.. రెండు సార్లు కాదు.. 50 సార్లకు చేరిన హస్తిన యాత్ర. కానీ తెచ్చింది ఏమీ లేదు! శుష్కప్రియాలు.. శూన్య హస్తాలు. అయిననూ పోయి రావలె హస్తినకు అని పేర్కొంటూ రేవంత్‌పై కేటీఆర్ ధ్వజమెత్తారు. కానీ ఢిల్లీ యాత్రలతో మన రాష్ట్రానికి వచ్చిందేమిటి?? నో ప్రాజెక్ట్, నో ఫండింగ్, నో ప్యాకేజీ.. దానికి బదులు దక్కింది మాత్రం%ఔ% ఫోటో షూట్లు, వీడియోలు. విందు రాజకీయాలు! అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పాలించే ముఖ్యమంత్రి కావాలి. ఢిల్లీకి యాత్రలు చేసే టూరిస్ట్ సీఎం కాదు! అని కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

## పార్లమెంట్ సాక్షిగా

## తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయం

**హైదరాబాద్ :** పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పడం వలన రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ కి కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల లేఖ రాశారు. ఖరీఫ్ 2025 కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని, కేటాయించిన దానిలో కూడా నెలవారి సరఫరా చేయాల్సిన దానికంటే తక్కువగా సరఫరా చేయడం వలన రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు కేటాయింపుల ప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని, దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకి లేఖలు కూడా రాయడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలోకూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, జులై మాసం వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లేఖలో కోరారు.

## ప్రజా క్షేత్రంలోకి మీనాక్షి

-మొదటిపేజీ తరువాయి

నాయకురాలిగా ఒక ప్రత్యేక ఇమేజ్ తెచ్చుకున్నారు. జూలై 31న పరిగిలో ఈ కార్యక్రమం ప్రారంభమయ్యింది. ఆగస్టు 2న నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, ఆగస్టు 3న ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ లో ఆగస్టు 4న కరీంనగర్ జిల్లాలోని చొప్పదండిలో ఆగస్టు 5న వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేటలో ఆమె పర్యటిస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఒక కమిటీ వేశారు. పార్టీని బలోపేతం చేసే దిశలో ఆమె చేస్తున్న పాదయాత్ర హాట్ టాపిక్ గా మారింది. ఈ పాదయాత్ర కాంగ్రెస్ పార్టీలో ఒక ఉత్సాహాన్ని నింపుతుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు.విపక్ష నేతలు మాత్రమే పాదయాత్ర చేసి, ప్రజల్లో తాము ఉన్నామని భరోసా ఇవ్వడమే కాకుండా, ప్రత్యక్షంగా వారి సమస్యలు తెలుసుకోవడానికి చేశారు. ఎన్నికల ముందు పాదయాత్ర చేసిన వారికి ప్రజలు పట్టంకట్టిన చరిత్ర ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ లో చూశాం.కానీ ఈ పాదయాత్రకు ఒక ప్రాముఖ్యత ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. కేవలం పదవే పరమావిధిగా ఎప్పుడూ అదే కోణంలో ఆలోచించే నాయకులు, వారికి చెందిన చానళ్లు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతున్నారు.ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా ప్రభుత్వ పనితీరుపై ప్రజాస్పందన ఎలా ఉంది. ప్రజలు ప్రజా ప్రభుత్వ తీరుపై ఏ విధంగా స్పందిస్తున్నారు. ఇంకా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందనే విషయాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం ఒక శుభ పరిణామం. ఈ పాదయాత్ర మూలంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుంది. కేవలం ఎన్నికల సమయంలో చేసిన పాదయాత్ర అధికారాన్ని అందిస్తుందని అనుకోవచ్చు కానీ, ఇలాంటి సమయంలో పాదయాత్ర ఆ అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రజాపాలన ఎలా ఉందని ప్రజల నుంచి తీసుకునే ఫీడ్ బ్యాక్ తో పార్టీ ఎలాంటి నిర్ణయాలు భవిష్యత్తులో తీసుకోవచ్చని తెలిసిపోతుంది.అలాగే పార్టీ శ్రేణులను ఉత్తేజపరుస్తుందని అనడంలో సందేహం లేదు.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నిర్వహించిన "జనహిత పాదయాత్ర" కు విశేష స్పందన కనిపించింది. ఈ కార్యక్రమంలోటీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు.అధికారంలో ఉండి పాదయాత్రలు చేయడమేంటని విమర్శిస్తున్న వారికి ఈ విధంగా జవాబిచ్చారు. ప్రజలతో మమేకమయ్యేందుకే ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఎంత వరకు చేరుతున్నాయి, రాబోయే రోజుల్లో ఇంకేం చేయాలి అని ప్రజలనే అడిగి తెలుసుకోవాలనేదే తమ సంకల్పమని తేల్చి చెప్పారు. అడుగడుగున ఆమె ను ప్రజలు ఆదరిస్తున్న తీరు ప్రజల్లో కాంగ్రెస్ పై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది.

## బీటెక్ రెండేళ్లు చదివాక బయటికి వెళ్లే అవకాశం

**హైదరాబాద్ :** బీటెక్ కోర్సులు, సిలబస్ నవీకరణకు సంబంధించిన జేఎన్‌టీయూ రెగ్యులేషన్-25 ముసాయిదా సిద్ధం అయింది. ఈ సంవత్సరం సిలబస్‌లో మార్పులు, కోర్సు అమరిక (స్ట్రక్చర్)పై ఇప్పటికే బీవోఎస్ (బోర్డ్ ఆఫ్ స్టడీస్) సమావేశాలు ముగిసిన విషయం తెలిసిందే.కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి సూచనలు, సలహాలు : యూనివర్సిటీ అధికారులు, గుర్తింపు పొందిన కాలేజీల ప్రతినిధులతో పాటు ఐఐటీ, ఎన్ఐటీ, వివిధ పరిశ్రమల నిపుణుల సూచనల మేరకు వర్సిటీ అకడమిక్ అండ్ ప్లానింగ్ (డీఏపీ) అధికారులు గురువారం ముసాయిదాను సిద్ధం చేశారు. ఉపకులపతి టి.కిషన్‌కుమార్ రెడ్డి ఆమోదం మేరకు డీఏపీ డైరెక్టర్ వి.కామాక్షి ప్రసాద్ దీన్ని డీఏపీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకుని వచ్చారు. ఈ ముసాయిదాపై కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి సూచనలు, సలహాలకు శనివారం రాత్రి వరకు అవకాశం అచ్చారు. అనంతరం ఆర్-25 తుది నివేదిక తయారవుతుంది.ఇప్పటివరకు నాలుగు సంవత్సరాల బీటెక్ కోర్సులో 160 క్రెడిట్లు ఉండేవి. ప్రతి స్టూడెంట్?కు తప్పనిసరిగా 160 రావాల్సిందే. అప్పుడే యూజీ పట్టా వస్తోంది. దీనిలో మార్పు చేస్తూ మొత్తం క్రెడిట్లను 164కు పెంచుతూ అందులో 4 క్రెడిట్లకు మినహాయింపును ఇచ్చారు. అంటే 164లో 160 క్రెడిట్లు వస్తే పట్టా సాధించవచ్చు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ద్వితీయ, తృతీయ ఏడాదిలో ఉండే 4 నైపుణ్యాభివృద్ధి శిక్షణ సబ్జెక్టులకు ఒక్కోదానికి ఒక క్రెడిట్ ఇస్తారు.బీటెక్ రెండు సంవత్సరాలు చదివిన తరువాత కోర్సు నుంచి బయటికి వెళ్లాలని అనుకుంటే అవకాశం కల్పిస్తూ, రెండు సంవత్సరాలకు డిప్లొమా సర్టిఫికెట్ ఇస్తారు. తరువాత స్టూడెంట్? బీటెక్‌లో తిరిగి చేరాలని అనుకుంటే మొదట ప్రవేశించిన సంవత్సరం నుంచి ఎనిమిది సంవత్సరాలలోపు ఎప్పుడైనా మూడో ఏడాది నుంచి ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసే అవకాశం కల్పించారు.మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల (మూక్స్)ను స్టూడెంట్స్? ముందస్తుగానే పూర్తి చేసుకునే అవకాశం ఇచ్చారు. పర్యావరణశాస్త్రం, భారతీయ జ్ఞాన పద్ధతులు, భారత రాజ్యాంగం కోర్సులకు క్రెడిట్




## ఆరోగ్యం

తేనె పోషకాలతో కూడిన అమృతం. ఇందులో విటమిన్ సి, పొటాషియం, కాల్షియం, జింక్ వంటి విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అంతే కాదు, దీనికి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఉన్నాయి. తేనె పోషకాలతో కూడిన ఆయుర్వేద ఔషధం. ఎందుకంటే ఇందులో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అంతే కాదు.. ఇందులో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. కానీ షుగర్ ఉన్నవారు దీనిని చక్కెర ప్రత్యామ్నాయంగా తినవచ్చా? మధుమేహం ఉన్నవారికి తేనె మంచిదా? అనే సందేహాలు చాలా మందిలో ఉంటాయి.

## షుగర్ ఉన్నవాళ్లు తేనె తినొచ్చా?



తేనెలో విటమిన్ సి, పొటాషియం, కాల్షియం, జింక్ వంటి విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇందులో శోథ నిరోధక లక్షణాలు కూడా ఉన్నాయి. వైద్యుల అభిప్రాయం ప్రకారం.. మధుమేహం ఉన్నవారు చక్కెరకు ప్రత్యామ్నాయంగా తేనెను తినకూడదు. ఎందుకంటే ఇది ఏ విధంగానూ మంచిది కాదు. తేనెలో చక్కెర కంటే ఎక్కువ కార్బోహైడ్రేట్లు, కేలరీలు, స్వీట్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను త్వరగా పెంచుతుంది. కాబట్టి దీనిని చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించడం మంచిది కాదు. కానీ మీరు తేనె తినాలనుకుంటే, దానిని తక్కువ పరిమాణంలో తీసుకోవాలి. తేనెలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. ఇది బరువు పెరగడానికి ప్రధాన కారణం. కాబట్టి నిపుణులు డయాబెటిస్ ఉన్నవారు తమ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలని.. తక్కువ పరిమాణంలో తేనెను తినాలని సలహా ఇస్తున్నారు.

# వంట నూనె కొనేముందు ఈ విషయాలు మర్చిపోవద్దు

వంట నూనె కొనే ముందు మూడు విషయాలను తనిఖీ చేయడం చాలా అవసరమని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ అంశాలను తనిఖీ చేసిన తర్వాతే కొనుగోలు చేయడం ఉత్తమం. అంతే కాదు, ఆహారంలో నూనె వాడకాన్ని కూడా వీలైనంత తగ్గించాలి. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. అందులో ప్రధానంగా వంట నూనె. నూనె ప్యాకెట్లు కొనేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఫిట్‌గా ఉండటానికి, డైట్ ప్లాన్ సరిగ్గా ఉండాలి. నూనె మంచిది కాకపోతే అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉంటాయి. అందుకే వంట నూనె కొనే ముందు, కొన్ని అంశాలపై శ్రద్ధ వహించాలని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నూనె లేకుండా వంట చేయడం చాలా కష్టం. కానీ ఒక వ్యక్తి ఒక రోజులో మూడు లేదా నాలుగు టేబుల్ స్పూన్ల కంటే ఎక్కువ నూనెను ఉపయోగించకూడదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కొంతమందికి ఇది తెలిసినప్పటికీ, దానిని పాటించరు. మార్కెట్లో చాలా రకాల వంట నూనెలు ఉన్నాయి. అందుకే ప్రతిదీ మంచిదని అనుకోవడం పొరపాటు. కాబట్టి, ఏదైనా నూనె కొనే ముందు, మనం మూడు విషయాలను తనిఖీ చేయాలి.నిజానికి.. ఆరోగ్యాన్ని కాపాడుకునే విషయానికి వస్తే.. ప్రతి ఒక్కరూ ప్రోటీన్లు, చక్కెరలు, కేలరీల గురించి మాట్లాడతారు. అవును.. ఈ మూడు అంశాలు ఆరోగ్యంగా ఉండటానికి చాలా ముఖ్యమైనవి. ఈ మూలకాల సమతుల్యత విషయంలో ఎప్పుడూ రాజీ పడకూడదు. కానీ ఈ మూడింటితో పాటు మరొక ముఖ్యమైన విషయం నూనె. అది సరైనది అయితేనే, ఆరోగ్యంగా ఉంటాం. నూనె కొనే ముందు ఫస్ట్ చెక్ చేయాల్సింది అది కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ కాదా..? సాధారణంగా, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ ఆరోగ్యానికి చాలా మంచిది. ఎందుకంటే ఈ నూనెను వేడి చేయకుండా తయారు చేస్తారు. అంతేకాకుండా వాటిలో ఎలాంటి రసాయనాలు ఉండవు. చాలా యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. అంతే కాదు వాటిలో విటమిన్ %జు%, పాలీఫెనాల్ కంటెంట్ కూడా ఎక్కువగా ఉంటాయి. అందుకే వీటిని ఉపయోగించడం చాలా మంచిదని అంటారు. ఈ రకమైన నూనెలో ఉండే యాంటీఆక్సిడెంట్ల కారణంగా శరీరంలో పేరుకుపోయిన విషపూరితాలు సులభంగా తొలగిపోతాయి. అంతేకాకుండా ఈ నూనెతో వంట చేయడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. కొలెస్ట్రాల్ సమస్య కూడా ఉండదు. వంట నూనె కొనే ముందు తనిఖీ చేయవలసిన మరో ముఖ్యమైన విషయం స్మోక్ పాయింట్. నూనె ఆరోగ్యంగా ఉందా లేదా అనేది దీనిపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా మనం మన వంటలన్నింటినీ అధిక వేడి వద్ద వండుకుంటాము. వేయించడం, వివిధ స్నాక్స్ వంటివి ఉదాహరణలు. అలాంటి వాటిని వండేటప్పుడు.. నూనె 230 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకుంటుంది. అప్పుడు ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే మీరు ఎంచుకున్న నూనె ఈ వేడిని తట్టుకోగలదా లేదా అనేది. అంటే, మీరు కొనుగోలు చేసే నూనె ఈ స్మోక్ పాయింట్‌ను తట్టుకోలేకపోతే, ఇది శరీరంలో హానికరమైన వివిధ రసాయనాలు ఏర్పడటానికి దారితీస్తుంది.




# ఆ సమస్యలకు దివ్యౌషధం..



ఉల్లిపాయే కదా అని చాలా మంది లైట్ తీసుకుంటారు.. కానీ.. ఉల్లిపాయల్లో పోషకాలతోపాటు ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. అందుకే.. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు పెద్దలు.. ఉల్లిపాయల్లోని పోషకాలు, ఔషధ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే, ఉల్లిపాయను పోషకాల గనిగా పేర్కొంటారు. ఉల్లిపాయే కదా అని చాలా మంది లైట్ తీసుకుంటారు.. కానీ.. ఉల్లిపాయల్లో పోషకాలతోపాటు ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. అందుకే.. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు పెద్దలు.. ఉల్లిపాయల్లోని పోషకాలు, ఔషధ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే, ఉల్లిపాయను పోషకాల గనిగా పేర్కొంటారు. ఉల్లిపాయల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి.. కేలరీలు తక్కువగా ఉంటాయి. అందుకే.. దీనిని సూపర్‌ఫుడ్‌గా పేర్కొంటారు. ఉల్లిపాయలు లేకుండా ఏ కూర కూడా రుచిగా ఉండదు. ఉల్లి లేకుండా అసలు కూరనే వండరు.. వంటింట్లో ఏది లేకపోయినా.. ఉల్లి ఉండాల్సిందే.. ఇంకా ఉల్లిని సలాడ్‌లో కూడా ఉపయోగిస్తారు. ఉల్లిపాయలు రెండు రకాలుగా ఉంటాయి.. ఎర్ర ఉల్లిపాయలు, తెల్ల ఉల్లిపాయలు. ఎర్ర ఉల్లిపాయలు లానే.. తెల్ల ఉల్లిపాయల్లో కూడా ఎన్నో పోషకాలు దాగున్నాయి. సాధారణంగా ఎర్ర ఉల్లిపాయల కంటే.. తెల్ల ఉల్లి ఆరోగ్యానికి మరింత మేలు చేస్తుందంటున్నారు డైటీషియన్లు.. ఉల్లిపాయలో విటమిన్ సి, విటమిన్ బి6, ఫోలేట్, పొటాషియం, మాంగనీస్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, భాస్వరం, జింక్, రాగి, సెలీనియం, కోలిన్, ఇతర ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది: తెల్ల ఉల్లిపాయ అనేక సమస్యలను దూరం చేస్తుంది. ఈ ఉల్లిపాయను రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థను బలంగా మారుతుంది. ఇందులోని ఫైబర్ జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉల్లిపాయలోని ప్రీబయోటిక్ పొట్టను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. జుట్టు సమస్యలు: తెల్ల ఉల్లిపాయ మీ జుట్టుకు చాలా మేలు చేస్తుంది. చుండ్రు సమస్యను నివారించేందుకు తెల్ల ఉల్లిపాయ మంచిగా పనిచేస్తుంది. ఉల్లి.. రసాన్ని తలపై అప్లై చేసి కొంత సేపటి తర్వాత శుభ్రం చేసుకోవాలి. దీనివల్ల జుట్టు కూడా దృఢంగా మారుతుంది.కొలెస్ట్రాల్ తగ్గేలా చేస్తుంది: తెల్ల ఉల్లిపాయలోని పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడతాయి. చెడు కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతుంటే.. ప్రతిరోజూ తెల్ల ఉల్లిపాయలను తినడం మంచిది.. ఇది కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంతోపాటు.. బరువును తగ్గేలా చేస్తుంది. గుండె ఆరోగ్యం: తెల్ల ఉల్లిపాయ బీపీని నియంత్రిస్తుంది.. ఇది శరీరాన్ని కూల్ చేయడంతోపాటు.. గుండె సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కలిగిసత్తోంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు..రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుంది.

# బంగాళాదుంపలు తినడం మంచిదేనా..

మొలకెత్తిన బంగాళాదుంపలు తినడం ఆరోగ్యానికి హానికరం. మొలకెత్తిన బంగాళాదుంపల్లో ఉండే 'సోలానిన్' అనే ప్రమాదకరమైన టాక్సిన్ జీర్ణవ్యవస్థపై నేరుగా ప్రభావం చూపుతుంది. ఇది తీవ్రమైన వాంతులు, విరోచనాలు, తల తిరగడం, అపస్మారక స్థితి వంటి సమస్యలకు దారితీస్తుంది. సోలానిన్ విషం శరీరంలో పెరిగితే ప్రాణాంతకం కూడా కావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి మొలకలు వచ్చిన బంగాళాదుంపలకు దూరంగా ఉండటం మంచిది. మనం సాధారణంగా బంగాళాదుంపలను ఇంటికి తెచ్చుకుంటాం. వాటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచినప్పుడు మొలకలు రావడం మనం గమనిస్తుంటాం. చాలామంది ఈ మొలకలను తీసేసి బంగాళాదుంపలను వంటకు ఉపయోగిస్తుంటారు. అయితే, మొలకెత్తిన బంగాళాదుంపలను తినడం వల్ల ప్రాణాపాయం కూడా సంభవించవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బంగాళాదుంపలలో 'సోలానిన్' అనే విషపూరిత టాక్సిన్ ఉంటుంది. ఈ టాక్సిన్ ప్రధానంగా బంగాళాదుంపలు మొలకెత్తినప్పుడు, లేదా సూర్యరశ్మికి ఎక్కువగా గురై ఆకుపచ్చ రంగులోకి మారినప్పుడు అధికంగా ఉత్పత్తి అవుతుంది. ఇది శరీరంలో విషాన్ని పెంచి, జీర్ణవ్యవస్థపై నేరుగా ప్రభావం చూపుతుంది. దీని వల్ల వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇటీవల 25 ఏళ్ల వ్యక్తి మొలకెత్తిన బంగాళాదుంప కూర తిని వాంతులు, అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మొలకెత్తిన బంగాళాదుంపలు తినడం వల్ల కేవలం జీర్ణ సమస్యలే కాకుండా, అలసట, కాళ్లు, చేతుల్లో నొప్పులు, తల తిరుగుడు, తిమ్మిరి వంటి నాడీ సంబంధిత సమస్యలు కూడా తలెత్తుతాయి. తీవ్రమైన సందర్భాల్లో శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా గర్భిణీలు, పిల్లలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే, ఇలాంటి ఆహార పదార్థాలకు వారిని దూరంగా ఉంచడం చాలా ముఖ్యం. పాడవ్వకూడదంటే.. బంగాళాదుంపలను గది ఉష్ణోగ్రత వద్ద, పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి. మొలకలు వచ్చిన వెంటనే వాటిని పడేయాలి. ఆకుపచ్చగా మారిన బంగాళాదుంపలను కూడా వాడకూడదు. బంగాళాదుంపలు ఎక్కువ రోజులు పాడవకుండా ఉండాలంటే, వాటితో పాటు ఒక యాపిల్‌ను నిల్వ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం వంట కోసం మొలకలను తొలగించడం సరిపోదు. సోలానిన్ విషం బంగాళాదుంప మొత్తంలో వ్యాపిస్తుంది కాబట్టి, మొలకెత్తిన లేదా ఆకుపచ్చగా మారిన బంగాళాదుంపలను పూర్తిగా పారవేయడమే సురక్షితమైన మార్గం. లేకపోతే అది ప్రాణాంతకం కావచ్చు.



# అధిక బరువుతో బాధపడుతున్నారా..



ఈ రోజుల్లో చాలామంది అధిక బరువు సమస్యతో బాధపడుతున్నారు. బరువు తగ్గడానికి అనేక మార్గాలు ఉన్నప్పటికీ, కొన్నిసార్లు అవి చాలా కష్టమైనవిగా అనిపిస్తాయి. అయితే, మన ఇంట్లో సులభంగా దొరికే ఒక సాధారణ పానీయం మజ్జిగ. ఇది బరువు తగ్గించడంలో చాలా సహాయపడుతుంది. మజ్జిగ అనేది ప్రోబయోటిక్ అధికంగా ఉండే తక్కువ కేలరీల పానీయం. ఇది శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. మజ్జిగలో చల్లబరిచే గుణాలు ఉన్నందున వేసవిలో దీనిని ఎక్కువగా తీసుకుంటారు. వేసవిలో మజ్జిగ తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. మజ్జిగ శరీరాన్ని అనేక సమస్యల నుంచి ఉపశమనం చేస్తుంది. బరువు తగ్గడానికి లేదా కడుపు సమస్యలకు అయినా, ప్రజలు తరచుగా మజ్జిగ తినమని సిఫార్సు చేస్తారు. మజ్జిగలోని పోషకాలు దానిని ప్రత్యేకంగా చేస్తాయి. మజ్జిగ తక్కువ కేలరీల పానీయం. ఇందులో కాల్షియం, ప్రోటీన్, విటమిన్ బి2, విటమిన్ బి12, పొటాషియం, భాస్వరం, అయోడిన్, జింక్, ప్రోబయోటిక్స్ ఉంటాయి. ప్రోబయోటిక్స్ పేగులను ఆరోగ్యంగా ఉంచడానికి పనిచేస్తాయి. మజ్జిగ తీసుకోవడం వల్ల ఎముకలు బలపడటమే కాకుండా కణాలను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. మజ్జిగలో లాక్టోబాసిల్లస్ అసిడోఫిలస్, బిఫిడోబాక్టీరియం బిఫిడమ్ అనే ప్రోబయోటిక్స్ ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరిచే మంచి బ్యాక్టీరియా. ఇది శరీరంలో మంటను కూడా తగ్గిస్తుంది. మజ్జిగ తిన్న తర్వాత, కడుపు నిండినట్లు అనిపిస్తుంది. ఎక్కువసేపు ఆకలిగా అనిపించదు. మజ్జిగలో ప్రోటీన్ ఉంటుంది. ఇది జీర్ణం కావడానికి సమయం పడుతుంది. త్వరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకుంటే, పగటిపూట కాకుండా రాత్రిపూట మజ్జిగ తాగడం మంచి ఎంపిక. రాత్రిపూట మజ్జిగ తాగడం ఎందుకు ప్రయోజనకరంగా ఉంటుందో తెలుసుకుందాం.మజ్జిగలో ఉండే ప్రోటీన్, కాల్షియం మీకు ఎక్కువసేపు ఆకలిగా అనిపించకుండా చేస్తాయి. ఇది అర్ధరాత్రి కోరికలను కూడా తొలగిస్తుంది.

# బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

**రిజర్వేషన్ల అమలుకు కేంద్రమే అడ్డు**

**బీసీ బిల్లు, ఆర్డినెన్సు ఆమోదంలో జాప్యానికి నిరసనగా 5,6,7 తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా**

**రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**




**మంథని :** బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్న కేంద్ర ప్రభుత్వం మాత్రం అడ్డుపడుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శనివారం మల్హర్ మండల కేంద్రంలోని తాడిచెర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పాత్రికేయులతో మాట్లాడుతూ వెనక బడిన తరగతుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తుందని కొనియాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అసెంబ్లీ లో బిల్లు పాస్ చేసి అమోదం కోసం రాష్ట్రపతి కి పంపించినప్పటికీ ఇప్పటి వరకు ఆమోదం లభించలేదన్నారు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్ కోసం కేబినెట్ లో నిర్ణయించి ఆర్డినెన్సు తెచ్చినప్పటికీ ఇంకా గవర్నర్ ఆమోదం లభించలేదని తెలిపారు. కేంద్రం లో ఉన్న బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలకు బీసీ రిజర్వేషన్ లపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ బిల్లును 9 వ షెడ్యూల్ లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ బిల్లు, ఆర్డినెన్సు ఆమోదంలో జాప్యానికి నిరసనగా 5,6,7 తేదీలలో ముఖ్యమంత్రి అధ్యక్షతన దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించామని , గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ అప్పుడు బీసీ రిజర్వేషన్ చట్టం చేయకుండా ఇవాళ మొసలి కన్నీరు కారుస్తు రాజకీయ లబ్ధి కోసమే నింద ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారికి బీసీ రిజర్వేషన్ ల పట్ల చిత్త శుద్ధి ఉంటె డిల్లీ లో జరిగే ధర్నాలో పాల్గొని బీసీ రిజర్వేషన్ బిల్లు కోసం తమతో కలిసి రావాలని డిమాండ్ చేశారు. తాడిచెర్ల గ్రామానికి చెందిన దళిత సోదరుడు దండు రమేష్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ ఆర్ ఈ జి ఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా నియమించడం దళితులకు దక్కిన గౌరవం అన్నారు. ఈ సందర్భంగా దండు రమేష్ ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్హల్ రావు, సింగిల్ విండో చైర్మన్ ఇప్ప మొండయ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిత రాజి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే షీటీమ్ ముఖ్య ఉద్దేశం



**సిద్ధిపేట :** మహిళల రక్షణకు పెద్దపీట ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తాంమహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి స్కూల్ లలో కాలేజీలలో మరియు గ్రామాలకు వెళ్లి మహిళలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి అవగాహన కల్పిస్తున్న సిద్ధిపేట జిల్లా షీటీమ్ బృందాలు..బాలికలు, మహిళలు మౌనం వీడితే విజయం సాధించినట్లేర్యాగింగ్, ఇవిటిజింగ్, ఏదైనా అవమానానికి గురి అయినట్లయితే వెంటనే జిల్లా షీటీమ్ వాట్సాప్ నెంబర్ 8712667434 కాల్ చేయాలి.సిద్ధిపేట జిల్లాలోని షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు సిబ్బంది 7/2025, జులై నెలలో వివిధ ప్రదేశాలలో కాలేజీలలో నిర్వహించిన అవేర్నెస్ కార్యక్రమాల వివరాలు: సిద్ధిపేట జిల్లాలో షీటీమ్స్ తో మహిళలకు, బాలికలకు భద్రత, భరోసాజిల్లాలోని హాట్స్పాట్ వద్ద షీటీమ్స్ తో నిరంతరం నిఘా.ఈవిటీజర్స్ 43 మందిని పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించి, 43 ఈ పెట్టి కేసులు నమోదు చేయడం జరిగింది.హాట్స్పాట్ 50,షీటీమ్స్ బృందాలు హాట్స్పాట్ 315 సార్లు సందర్శించడం జరిగింది.షీ టీమ్స్ 64 వివిధ ప్రదేశాలలో కాలేజీలలో అవేర్నెస్ కల్పించడం జరిగింది.సిద్దిపేట జిల్లాలో సిద్ధిపేట, గజ్వేల్, హుస్నాబాద్, డివిజన్లవారీగా షీటీమ్స్ పనిచేయడం జరుగుతుంది.సిద్దిపేట జిల్లాలో ఉన్న షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలలో, ప్రభుత్వ పాఠశాలల్లో, తెలంగాణ మోడల్ స్కూళ్లలో, రెసిడెన్షియల్ స్కూల్ లలో కేజీబీవీ స్కూళ్లలో ప్రైవేట్ స్కూల్, ప్రైవేట్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్,ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యుమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలపై నూతన చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది.పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. మహిళలకు పిల్లలకు నూతన చట్టాలు అండగా మరియు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. నూతన చట్టాలలో నేరస్తులకు కఠిన శిక్షలు అమలు చేయడం జరుగుతుంది. మహిళలు బాలికల రక్షణ గురించి తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా షీటీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. మహిళల, బాలబాలికల, విద్యార్థిని, విద్యార్థులకు, రక్షణగా నిలుస్తూ సేవలు అందించడం జరుగుతుంది, ఏదైనా ఫోన్ వస్తే వెంటనే సంఘటన స్థలానికి చేయుచున్నారు, గుర్తించిన హాట్స్పాట్ వద్ద మరింత నిఘా ఉంచడం జరుగుతుంది. హాట్స్పాట్స్ ప్రదేశాలలో సీసీ కెమెరాలు పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని, పనిచేయకపోతే వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు రిపేర్ చేయాలని సూచించడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో షీ టీమ్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. మహిళలు బాలికలు విద్యార్థినిలు షీటీమ్స్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434, సిద్ధిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ 8712667100 ఫోన్ చేయాలని సూచించారు.ఫోక్సో, లైంగిక వేధింపులకు గురైన మహిళలకు బాలికలకు భరోసానిస్తున్న సిద్ధిపేట భరోసా సెంటర్.మహిళలకు అండగా స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్లైంగిక దాడులకు గురి అయిన బాధ్యతలకు భరోసా కల్పించడంతోపాటు వారికి భరోసా కేంద్రము స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ పూర్తి సహయ సహకారాలను అందిస్తుంది.భరోసా సెంటర్ సేవల గురించి సంబంధిత బాధితులు భరోసా సెంటర్ నెంబర్ 08457-293098, డయల్ 100, నెంబర్ కు ఫోన్ చేసి సహాయ సహకారాలు పొందవచ్చని సూచించారు.స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్లో, గృహహింసకు వివిధ వేధింపులకు గురి అవుతున్న మహిళలు సంబంధించిన దరఖాస్తులు జులై నెలలో 28 ఫిర్యాదులు వచ్చాయి వాటిలో నుండి భార్యాభర్తలను మరియు కుటుంబ సభ్యులను పిలిపించి 22,కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఎవరైనా మహిళలు గృహహింసకు మరియు కట్నం తదితర అంశాల గురించి వేధింపులకు గురి చేస్తే వెంటనే స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. మరియు స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలని మహిళలకు సూచించారు

# రాజకీయ లబ్ధి కోసమే 'ఆపరేషన్ సింధూర్'

**తమ్మినేని వీరభద్రం**




**కొత్తగూడెం :** ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌పై చేసిన దాడిని బీజేపీ తన రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటుందని, పెహల్గాం దాడిలో పాల్గొన్న వాళ్లలో ఎంత మంది పాకిస్తాన్ ఉగ్రవాదులను చంపారో కేంద్ర ప్రభుత్వం చెప్పలేకపోతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ పై విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్రం వద్ద సరైన సమాధానం లేదన్నారు. ప్రధాని మోదీ తన అనుకూల మీడియాతో ప్రపంచానికి అబద్ధాలు వల్లెవేశారని కానీ అంతర్జాతీయ ఛానెళ్లు భారత ప్రభుత్వ మీడియాను అవహేళన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ హిందూ ? ముస్లింలను రెచ్చగొడుతూ వక్ర బుద్ధిని చూపిస్తున్నాయని దుయ్యబట్టారు. భారత్ ? పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రచారం చేసుకుంటుంటే అది నిజామా? అబద్ధమా? అని విపక్ష సభ్యులు అడిగితే సమాధానం చెప్పలేకపోతున్నారని మండిపడ్డారు. ఇది మోదీ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ముస్లిం, క్రిస్టియన్ ఓట్లను తగ్గించడమే లక్ష్యంగాట్రంప్ మోదీకి మిత్రుడైనప్పటికీ 25 శాతం టారిఫ్ వేయడంలో వెనుకంజ వేయడం లేదన్నారు. ప్రస్తుతం బ్రిటన్‌తో జీరో టారిఫ్ తో మోదీ ఒప్పందం చేసుకున్నారని, ఇది భవిష్యత్‌లో వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు, వస్తువులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్‌లో ఓటర్ల తొలగింపు పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని, ఈసీ, బీజేపీ వ్యవహరిస్తున్న తీరును సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్ ఓట్లను తగ్గించడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమయ్యారని, ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనన్నారు. స్థానిక ఎన్నికలలో ప్రస్తుతం ఒంటరిగా వెళ్లే ఆలోచనలో ఉన్నామని, అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాధ్యత తీసుకోవాలిసీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని, ఏపీలో కలిపిన ఐదు గ్రామాలను తిరిగి తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుత ప్లాన్‌తో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్ట్ తో భద్రాచలం కు తీవ్ర ముప్పు పొంచిఉందని, భద్రాద్రి దేవాలయం కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని నిజమైన అర్హులకే ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పై బీజేపీ దృష్టి సారించి అమలు పరిచే విధంగా కేంద్రంపై బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ఒత్తిడి తేవాలన్నారు.సీతారామ ప్రాజెక్ట్ కు జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఇప్పటికీ నాలుగు సార్లు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారని ఎద్దేవా చేశారు. పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్ట్ నిర్మించి ఈ ప్రాంత రైతాంగానికి నీళ్లు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా రైతులతో కలిసి అవసరమైతే ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవి కుమార్, జిల్లా కార్యదర్శి మెచ్చ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు యలమంచిలి రవికుమార్, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, ఏ జే రమేశ్, ఎం.జ్యోతి, కారం పుల్లయ్య, ఎం బీ.నర్సారెడ్డి, లక్కి బాలరాజు పాల్గొన్నారు.

## మహిళా యోగ పోటీ కార్యక్రమమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్ధిపేట :** సిద్ధిపేట పట్టణం లో విపంచి కళానిలయం లో జరిగిన మహిళా యోగ పోటీ కార్యక్రమమం లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతుకరోనా ప్రజల జీవితాల్లో అనేక మార్పులను తెచ్చింది. మన రోజూవారి దినచర్యలో మార్పు ఉండాలి, ఆరోగ్యం పట్ల క్రమశిక్షణ ఉండాలని కరోనా ప్రపంచానికి నేర్పించింది. అభివృద్ధి అంటే నాలుగు కాలేజీలు, నాలుగు రోడ్లు, నాలుగు స్టేడియంలు కట్టడం కాదు ప్రజల జీవన ప్రమాణాలు మారాలి. ఆరోగ్య సిద్ధిపేటే..అభివృద్ధి సిద్ధిపేట ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే అది అభివృద్ధి ప్రజలు ఆరోగ్యంగా ఉండటం కూడా అభివృద్ధిలో భాగమే. పెద్దలు ఆరోగ్యమే మహా భాగ్యం అన్నారు. లక్షలు ఖర్చుపెట్టి హాస్పిటల్లో నయం చేసుకునే కన్నా స్వీయ క్రమశిక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకోండి. పిల్లలు ఫిజికల్ గేమ్స్ ఆడటం మానేసారు. ఆన్లైన్ గేమ్స్ మొదలు పెట్టారు. ఇవ్వాళ తల్లులు కూడా పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇవ్వడం పిల్లలకు అన్నం తినిపించడం ఈజీ అయ్యింది కానీ అది మంచిది కాదు.యోగా మనలో మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది యోగా చేయడం ద్వారా మన ఆరోగ్యాన్ని, మన శరీరాన్ని బాగా ఉంచుకోవచ్చు మంచం మీద పడ్డాక ఎంత బాధ పడ్డా ఎం కాదు అందుకే తప్పకుండా అందరూ యోగా చేయడం నేర్చుకోవాలి ప్రతిరోజూ అవుట్ డోర్స్ గేమ్స్ ఆడాలి.జంక్ ఫుడ్ తినవద్దు మితమైన ఆహారం అమితమైన ఆరోగ్యం వాకింగ్ యోగా లాంటివి అవసరం పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా అవసరం కాబట్టి గేమ్స్ లాంటివి ఆడించాలి. జీవితంలో ఒడిదొడుకులు నేర్చుకుంటారు యోగా, గేమ్స్ వల్ల ఓటమిని జీర్ణించుకునే శక్తి వస్తుంది ఆన్ లైన్స్ గేమ్స్ ఆడకండి. సిద్ధిపేట ఈరోజు జాతీయ స్థాయిలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమైన వారిని అభినందిస్తున్నాను మీకు నా సహకారం ఎల్లపుడూ ఉంటుందిఎందుకంటె ఆరోగ్యం ఉంటె అందరూ బాగుంటారు.

## నిరాశ్రయ వృద్ధునికి కొండంత భరోసా

**రామగుండం :** గోదావరిఖని పట్టణంలోని ప్రముఖ దేవాలయమైన కోదండ రామాలయం, సింగరేణి ఏరియా హాస్పిటల్ ఎదురుగా నిరాశ్రయుడైన 80 ఏళ్ల కురువృద్ధుడు మల్లయ్య ఎలాంటి దిక్కు లేక మొక్కజొన్న పొత్తులు కాల్చి అమ్ముకొని జీవనం పోషించుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న భరోసా స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ నసీమా కురువృద్ధుడు మల్లయ్య ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తన జీవనోపాధికి కంకుల అమ్ముకుని జీవిస్తున్న దీన పరిస్థితిని అర్థం చేసుకొని పలువురు పుర ప్రముఖుల మధ్య శనివారం ఎండకు వానకు రక్షణగా తన మొక్క జొన్నపొత్తుల అమ్మకనీ విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తద్దనే సదుద్దేశంతో పెద్ద గొడుగును అందజేశారు. ఈ సందర్భంగా వారు 80 ఏళ్ల కురువృద్ధుడు పడుతున్న జీవన ఉపాధి విషయంలో ఇబ్బందులను తెలుసుకున్న భరోసా నసీమా ద్వారా కోదండ రామాలయంలో కొలువై ఉన్న ఆ దేవుడే సంకల్పించి కురువృద్ధుడు మల్లయ్యకు గొడుగు అందజేయించాడని, ఆ దేవుడు నిసహాయులకు చేసే సేవ రూపంలోనే ఉన్నాడని, నిస్సహాయులకు సేవలందిస్తున్న భరోసా స్వచ్ఛంద సంస్థ వారు మరింత ముందుకు వెళ్లాలని, ఆ కోదండ రాముని దయతో భరోసా స్వచ్ఛంద సంస్థ వారికి ఆర్థిక వనరులు చేకూరాలన్నారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ నసీమాతో పాటు సంఘ సేవకులు కటుకు ప్రవీణ్, బొల్లం మధుబాబు, కళ్యాణ్, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పారమిత వరల్డ్ స్కూల్‌లో ఘనంగా హౌస్ ప్రారంభ వేడుకలు



**కరీంనగర్ :** స్థానిక అల్గునూర్ పారమిత వరల్డ్ స్కూల్ లో హౌస్ ప్రారంభ వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పారమిత పాఠశాలల చైర్మన్ డా॥ ఈ .ప్రసాదరావు దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా పాఠశాల విద్యార్థులు గృహాల వారిగా పతాక ఆవిష్కరణ, క్రీడా ప్రమాణ స్వీకారం, అద్భుతమైన మార్చ్ పాస్ట్‌తో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం హౌస్ ప్రారంభ వేడుకలు లలో భాగంగా విద్యార్థులను ధ్యానచంద్ , ఆర్యభట్ట, సి.వి.రామన్ , చాణక్య గృహాలుగా విభజించి , ఈ గృహ ప్రారంభోత్సవ వేడుకలను అట్టహాసంగా చైర్మన్ డా॥ ఈ.ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డా॥ ఈ.ప్రసాదరావు మాట్లాడుతూ హౌస్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమూహచేతన, క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందనీ, విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ఇది బాగా దోహద పడుతుందని పారమిత పాఠశాలల్లో గత 30 ఏళ్లుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం అని పేర్కొన్నారు. హెడ్ బాయ్ ,హెడ్ గర్ల్ ప్రతీ గృహానికి క్యాప్టెన్, వైస్ క్యాప్టెన్, అసెంబ్లీ , సిసిఏ,స్పోర్ట్స్ క్యాప్టెన్ లను ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారనీ, ఈ గృహాలలోని విద్యార్థులు బృందాలు గా ఏర్పడి సాంస్కృతిక అంశాలు,క్రీడా అంశాలలో పోటీ పడడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన , వి.యు. యం.ప్రసాద్ , వినోద్ రావు ,ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్ హౌస్ కన్వీనర్ కె.శ్రీనివాస్ ,పి.ఈ.టీ లు జెట్టి శ్రీనివాస్ ,టి.శ్రీధర్ ,అశోక్ ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటింటికి సంజయన్న రాఖీ

**పోస్టర్ విడుదల చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

**రాఖీ పంపిణీ కార్యక్రమం చేపట్టిన ముత్యాల జగన్ రెడ్డిని అభినందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

**రాఖిలతో పాటు మహాశక్తి ఆలయంలో అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసిన పసుపు కుంకుమ అందజేత**

**అనుబంధాలకు ప్రతీక రక్షా బంధన్**



**కరీంనగర్ :** మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి ఆధ్వర్యంలో గన్నేరువరం మండలం లోని ప్రతీ గ్రామంలో ఇంటింటికి రాఖీ అందించే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి సంబందించిన పోస్టర్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతులమీదుగా కరీంనగర్ లో శనివారం పోస్టర్ విడుదల చేసారు.అన్నా చెల్లెళ్ళ అనుబందానికి ప్రతీక గా నిలుస్తున్న రాఖీ పండగ ప్రాముఖ్యత ను పెంచడమే లక్ష్యం గా రాఖీ లతో పాటు మహాశక్తి దేవాలయంలో అమ్మవార్ల సన్నిధి లో ప్రత్యేక పూజలు చేసిన పసుపు, కుంకుమ పంపిణీ చేస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు జగన్ రెడ్డి తెలిపారు. మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేవిధంగా,సమాజం లో అనుబందాలను మర్చిపోతున్న తరుణంలో ఇటువంటి కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమని కేంద్ర మంత్రి కొనియాడారు. అనుబందాలను గుర్తుచేసుకునే విదంగా ఈ రాఖీ పంపిణీ కార్యక్రమాన్ని గత మూడేళ్లుగా నిర్వహిస్తున్నట్లు జగన్ రెడ్డి తెలిపారు. కలకాలం నిలిచిబోయే అనుబందాన్ని మర్చిపోలేని రాఖీ పండగ రోజు రాఖీ లను మండల ప్రజలందరికీ అందించే కార్యక్రమాన్ని చేపట్టిన ముత్యాల జగన్ రెడ్డి ని కేంద్రమంత్రి బండి సంజయ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల రఘు, సొల్లు అజయ్ వర్మ, వరాల జ్యోతి,బండారు గాయత్రి, మాసం గణేష్, తాడూరి కిరణ్ రెడ్డి, బామండ్ల రాజు, మునిగంటి సత్తయ్య, పుల్లెల రాము తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# టెస్లాకు కోట్ల భారీ జరిమానా

### ఐడీబీఐ బ్యాంక్‌లో వాటాల విక్రయానికి అక్టోబరులో ఆర్థిక బిడ్స్




ప్రభుత్వ రంగంలోని ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటాల విక్రయాన్ని త్వరిత గతిన పూర్తి చేయటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. బ్యాంక్‌లో వాటాల విక్రయానికి సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో ఆర్థిక (ఫైనాన్షియల్) బిడ్స్‌ను ఆహ్వానించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) కార్యదర్శి అరుణిష్ చావ్లా వెల్లడించారు. విజయవంతమైన బిడ్డర్‌ను వచ్చే ఏడాది మార్చిలో ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలతో ఇప్పటికే ప్రాథమిక చర్చల ప్రక్రియ పూర్తయిందని, మూడో త్రైమాసికంలోనే బిడ్స్‌ను ఆహ్వానించే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. విజయవంతమైన బిడ్డర్‌ను ఎంపిక చేసిన అనంతరం అనుమతుల కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కు పంపించనున్నట్లు చావ్లా తెలిపారు. ఐడీబీఐ బ్యాంక్‌లో మొత్తం 60.72 శాతం వాటాల విక్రయానికి సంబంధించి ప్రభుత్వం, భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ).. అక్టోబరు 2022లో ఇన్వెస్టర్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)ను ఆహ్వానించాయి.

### ఐటీసీ లాభం రూ.5,343 కోట్లు




ఐటీసీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.5343.41 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.5176.99 కోట్లు. ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ.19,350.08 కోట్ల నుంచి రూ.23,129.35 కోట్లకు పెరిగింది. వ్యయాలు కూడా 26.73% పెరిగి రూ.16,752.31 కోట్లుగా నమోదయ్యాయి. 24 మంత్ర ఆర్గానిక్ బ్రాండ్ సంస్థ శ్రేష్ఠ నాచురల్ బయోప్రోడక్ట్స్‌ను ఈ ఏడాది జూన్ 13న కొనుగోలు చేసినందున, ప్రస్తుత ఫలితాలను ఏడాది క్రితంతో పోల్చలేమని సంస్థ వివరించింది. ఐటీసీ ఇన్ఫోటెక్ ఇండియా, సూర్యా నేపాల్, ఐటీసీ హోటల్స్ వంటి గ్రూప్ కంపెనీల పనితీరుతో అన్ని విభాగాల్లోనూ రాణించినట్లు ఐటీసీ వివరించింది. ఎఫ్ఎంసీజీ విభాగాదాయం రూ.15,354.30 కోట్లుగా ఉంది. ఇందులో సిగరెట్ల వాటానే రూ.9553.86 కోట్లు. బ్రాండెడ్ ప్యాకేజ్డ్ ఫుడ్స్, స్టాపుల్స్, మీల్స్, స్నాక్స్, డెయిరీ, బెవరేజెస్, కేక్‌లు, కాఫీ, విద్యా సంబంధ స్టేషనరీ విభాగాల ఆదాయం రూ.5800.44 కోట్లుగా ఉంది. వ్యవసాయ విభాగాదాయం రూ.9723.84 కోట్లు కాగా, పేపర్‌బోర్డులు, ప్యాకేజింగ్ ఆదాయం రూ.2116.62 కోట్లుగా నమోదైంది. ఐటీ సర్వీసులు, ఐటీసీ గ్రాండ్ సెంట్రల్ హోటల్, ఫుడ్ టెక్ నుంచి రూ.1182.59 కోట్ల ఆదాయం లభించింది. శుక్రవారం ఐటీసీ షేరు 1.14% లాభంతో రూ.416.50 వద్ద స్థిరపడింది.

ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ సంస్థ టెస్లాకు ఫ్లోరిడా కోర్టు భారీ జరిమానా విధించింది. 2019లో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థ లోపం వల్లే ప్రమాదం జరిగిందని ఫ్లోరిడా కోర్టు తేల్చింది. దీంతో బాధిత కుటుంబానికి 242 మిలియన్ డాలర్ల పరిహారం (భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.2,100 కోట్లు) చెల్లించాలని సదరు కంపెనీని కోర్టు ఆదేశించింది. కేసు వివరాల్లోకి వెళితే.. ఫ్లోరిడాలోని కీ లార్గోలో 2019లో ఈ ఘటన జరిగింది. జార్జ్ మెక్ గీ అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళుతూ అత్యాధునిక ఆటో పైలట్ ఫీచర్‌ను ఉపయోగించాడు. ఇది టెస్లా అందించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ వ్యవస్థ. మార్గమధ్యంలో జార్జ్ మొబైల్ కారులో కింద పడిపోయింది. కారు ఆటో పైలట్ మోడ్‌లోనే ఉందని భావించిన జార్జ్ కిందకు వంగి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. అయితే ఆ సమయంలో కారు అదుపు తప్పి పక్కనే పార్క్ చేసి ఉన్న మరో కారును ఢీకొట్టి ఇద్దరు వ్యక్తులపైకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో 22 ఏళ్ల యువతి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించగా, సుదీర్ఘ విచారణ అనంతరం తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ




ప్రమాదానికి నష్టపరిహారంగా బాధిత కుటుంబాలకు మొత్తం 329 మిలియన్ డాలర్లు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అయితే ప్రమాదానికి ఆటో పైలట్ వ్యవస్థ లోపం కూడా ఒక కారణమని గుర్తించిన న్యాయస్థానం.. ఇందుగానూ 242 మిలియన్ డాలర్లు టెస్లా కంపెనీ చెల్లించాలని ఆదేశించింది. మిగతా మొత్తం సదరు వాహన డ్రైవర్ చెల్లించాలని స్పష్టం చేసింది. అయితే ఫ్లోరిడా కోర్టు తీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు టెస్లా వెల్లడించింది.

## మరో రెండు బ్యాంకులు విలీనం




అప్పుడప్పుడు బ్యాంకుల్లో కొన్ని కుంభకోణాలు, లోపాలు చోటు చేసుకుంటాయి. బ్యాంకు వినియోగదారులకు సరైన సదుపాయాలు కల్పించడంలో బ్యాంకు విఫలమైతే రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపడుతుంటుంది. కొన్ని బ్యాంకులాను విలీనం చేస్తుంటుంది. దీంతో ఇప్పుడు రెండు బ్యాంకులు విలీనం చేసేందుకు ఆర్బీఐ ఆమోదం తెలిపింది..దేశంలోనే అతిపెద్ద సహకార బ్యాంకు సరస్వత్ కో-ఆపరేటివ్ బ్యాంక్. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్‌ను విలీనం చేసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం పొందిందని కేంద్ర బ్యాంకు శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఈ విలీనం ఆగస్టు 4, 2025 నుండి అమలులోకి వస్తుంది. సరస్వత్ బ్యాంక్ న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ అన్ని ఆస్తులు, బాధ్యతలను స్వీకరిస్తుంది. అలాగే దాని అన్ని శాఖలు సరస్వత్ బ్యాంక్ శాఖలుగా పనిచేస్తాయి. విలీన తేదీ తర్వాత చీ×జదీూ అన్ని ఆస్తులు, బాధ్యతలను అలాగే దాని కస్టమర్లను బ్యాంక్ స్వాధీనం చేసుకుంటుంది. ఈ విలీనం ప్రక్రియం పూర్తి చేయడానికి కేంద్ర బ్యాంకు, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం, 1949లోని సెక్షన్ 56తో కలిపి, సెక్షన్ 44లోని సబ్-సెక్షన్ (4) కింద తన అధికారాలను వినియోగించింది. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ డిపాజిటర్లతో సహా కస్టమర్లను ఆగస్టు 4, 2025 నుండి సరస్వత్ బ్యాంక్ కస్టమర్లుగా పరిగణిస్తారు. వారి ప్రయోజనాలకు పూర్తి రక్షణ ఉంటుంది. జూలై 22, 2025న జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సారస్వత్ బ్యాంక్ వాటాదారులచే విలీన ప్రక్రియ ఆమోదించింది. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ వాటాదారులచే వారి వార్షిక సర్వసభ్య సమావేశంలో కూడా దీనిని ఆమోదించింది. అలాగే తరువాత ఆమోదం కోసం =దీ×కి పంపింది. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ తన టాప్ మేనేజ్‌మెంట్ సభ్యులతో సంబంధం ఉన్న రూ.122 కోట్ల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఫిబ్రవరి 2025 నుండి నియంత్రణా పరిశీలనలో ఉంది.

### తనిష్క్ నుంచి సమృద్ధి కలెక్షన్




టాటా గ్రూపు ఆభరణాల రిటెయిల్ బ్రాండ్ తనిష్క్, వరమహాలక్ష్మి వ్రతాన్ని దృష్టిలో పెట్టుకుని 'సమృద్ధి' కలెక్షన్‌ను విడుదల చేసింది. ఆర్థిక సమృద్ధి, ఆరోగ్యం, విజయం కోసం చేసుకునే ఈ పండగ తెలుగు రాష్ట్రాల సాంస్కృతిక వైభవంలో కీలకమని.. ఈ ఆధ్యాత్మికతలో కీలకమైన సంప్రదాయ దీపం నుంచి ప్రేరణ పొంది ఈ తాజా కలెక్షన్‌ను విడుదల చేసినట్లు తనిష్క్ వెల్లడించింది. ఈ పండగ సందర్భంగా బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.450, వజ్రాభరణాల విలువపై 20% వరకు తగ్గింపు అందిస్తున్నట్లు వివరించింది. తనిష్క్ గోల్డ్ ఎక్స్ఛేంజ్‌నూ కొనుగోలుదారులు ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. ఆగస్టు 7 నుంచి 10 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని అన్ని స్టోర్లలో ఈ ఆఫర్ ఉంటుందని తెలిపింది. సమృద్ధి కలెక్షన్‌లో నెక్లెస్‌లు, గాజులు, చెవిపోగులు తదితరాలున్నాయని తనిష్క్ ప్రాంతీయ బిజినెస్ మేనేజర్ వాసుదేవ రావు తెలిపారు. క్లిష్టమైన నకాషి పని, యాంటిక్ ఫినిష్‌తో రూపొందించిన ఆభరణాల్లో అద్భుత రంగుల రాళ్లు ఉన్నాయని, సూక్ష్మ అంశాలకు సైతం అమిత ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు.

## ఊహించని రీతిలో చెలరేగిన ఆకాశ్..
# గంభీర్, గిల్ రియాక్షన్ వైరల్

ఇంగ్లండ్‌తో ఐదో టెస్టులో టీమిండియా పేసర్ ఆకాశ్ దీప్ అర్ధ శతకంతో మెరిశాడు. శనివారం నాటి మూడో రోజు ఆట సందర్భంగా డెబ్బై బంతుల్లో యాభై పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. టెస్టుల్లో తన తొలి హాఫ్ సెంచరీని ఇంగ్లండ్ గడ్డ మీద నమోదు చేశాడు.

గంభీర్, గిల్, జడేజా రియాక్షన్ వైరల్

నైట్ వాచ్‌మన్‌గా వచ్చి అర్ధ శతకంతో ఆకాశ్ దీప్ ఇరగదీయడంతో భారత శిబిరంలో నవ్వులు పూశాయి. హాఫ్ సెంచరీని సెలబ్రేట్ చేసుకునే క్రమంలో ఆకాశ్ బ్యాట్ పైకెత్తగానే.. కెమెరాలు ఇండియన్ డ్రెసింగ్‌రూమ్ వైపు మళ్లాయి. లోపల కూర్చుని ఉన్న హెడ్‌కోచ్ గౌతం గంభీర్ చిరునవ్వులు చిందించాడు.

మరోవైపు.. బయటకు వచ్చిన కెప్టెన్ శుబ్‌మన్ గిల్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చప్పట్లతో ఆకాశ్ దీప్‌ను ఉత్సాహపరుస్తూ అతడికి శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే, టీమిండియా రెండో ఇన్నింగ్స్ 43వ ఓవర్లో ఇంగ్లండ్ పేసర్ జేమీ ఓవర్టన్ బౌలింగ్‌లో షాట్ ఆడేందుకు ప్రయత్నించిన



ఆకాశ్ దీప్.. పాయింట్ దిశగా బంతిని గాల్లోకి లేపాడు. 66.. అవుట్

అక్కడికి దగ్గర్లో ఫీల్డింగ్ చేస్తున్న గస్ అట్కిన్సన్ పరుగెత్తుకుని వచ్చి డైవ్ చేసి మరీ బంతిని అందుకున్నాడు. దీంతో ఆకాశ్ దీప్ 'హీరోచిత' ఇన్నింగ్స్‌కు తెరపడింది. మొత్తంగా 94 బంతులు ఎదుర్కొన్న అతడు.. 12 ఫోర్ల సాయంతో 66 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద నిష్క్రమించాడు. ఫలితంగా టీమిండియా మూడో వికెట్ కోల్పోయింది. కాగా 75/2 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం నాటి ఆట మొదలుపెట్టి టీమిండియా.. భోజన విరామ సమయానికి 44 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 85, కెప్టెన్ శుబ్‌మన్ గిల్ 11 పరుగులతో క్రీజులో ఉన్నారు. లంచ్ బ్రేక్ సమయానికి టీమిండియా ఇంగ్లండ్ కంటే 166 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇక ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే టీమిండియా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను 2-2తో సమం చేయగలుగుతుంది.

**భారత్ వర్సెస్ ఇంగ్లండ్ ఐదో టెస్టు**
వేదిక: కెన్నింగ్‌టన్ ఓవల్, లండన్
టాస్: ఇంగ్లండ్.. తొలుత బౌలింగ్
భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరు: 224
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు: 247.

## స్పోర్ట్స్

### సెంచరీకి చేరువలో యశస్వీ.. ఓవల్ టెస్టుపై పట్టుబిగించిన టీమిండియా



సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే ఓవల్ టెస్టులో భారత జట్టు పట్టుబిగించింది. ఆదిలోనే రెండు వికెట్లు పడినా.. అద్భుత పోరాటంతో మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరుకుంది టీమిండియా. రెండో రోజు అర్ధ శతకంతో జట్టును ఆదుకున్న ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (85 నాటౌట్), నైట్ వాచ్‌మన్ ఆకాశ్ దీప్(66)లు బౌండరీల మోతతో శతక భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంగ్లండ్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వని ఈ ద్వయాన్ని లంచ్‌కు ముందు ఓవర్టన్ విడదీశాడు. ఆ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్(11 నాటౌట్) దూకుడుగా ఆడాడు. దాంతో.. లంచ్ బ్రేక్ సమయానికి భారత్ 3 వికెట్ల నష్టానికి 189 రన్స్ కొట్టింది. ప్రస్తుతానికి గిల్ సేన 166 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు తొలి సెషన్‌లో ఇంగ్లండ్ పేసర్లకు యశస్వీ జైస్వాల్ (85 నాటౌట్), ఆకాశ్ దీప్(66 : 94 బంతుల్లో 12 ఫోర్లు)లు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. స్లిప్‌లో ఫీల్డర్ల మధ్యలోంచి యశస్వీ బంతిని బౌండరీలకి తరలిస్తూ స్కోర్ బోర్డును నడిపించాడు. ఆకాశ్ సైతం చకచకా సింగిల్స్ తీస్తూ.. ఆపై ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ఆతిథ్య జట్టు బౌన్సర్లను కాచుకొన్న క్రీజులో నిలిచిన ఆకాశ్.. అట్కిన్సన్ ఓవర్లో బౌండరీలతో కెరీర్లో మొదటి అర్ధ శతకం నమోదు చేశాడు. తద్వారా నైట్‌వాచ్‌మన్‌గా ఫిఫ్టీ కొట్టిన రెండో భారత క్రికెటర్‌గా అతడు చరిత్రకెక్కాడు. 2011లో అమిత్ మిశ్రా ఇంగ్లండ్ పైనే 84 రన్స్ బాదాడు. ఆకాశ్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగానే బాల్కనీలోని భారత కెప్టెన్ గిల్, ఇతర ఆటగాళ్లు చప్పట్లు కొడుతూ ఆకాశ్‌ను అభినందించారు. ఎప్పుడూ సీరియస్‌గా ఉండే కోచ్ గౌతం గంభీర్ సైతం నవ్వాడు. ఫిఫ్టీ తర్వాత కూడా దంచేస్తున్న అతడిని ఓవర్టన్ పెవిలియన్ పంపాడు. బౌన్స్ అయిన బంతిని అంచనా వేయలేకపోయాడు.. గాల్లోకి లేచిన బంతిని అట్కిన్సన్ పరిగెత్తుతూ వచ్చి క్యాచ్ అందుకోగా.. మూడో వికెట్ 107 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం శుభ్‌మన్ గిల్ (11 నాటౌట్) రెండు ఫోర్లతో చెలరేగగా లంచ్ బ్రేక్‌లోపు భారత్ 189/3తో పటిష్ట స్థితిలో నిలిచింది.

### బహిష్కరించిన భారత్.. పాక్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం!

వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ -2025 టోర్నమెంట్‌లో సెమీస్ ఆడకుండానే ఇండియా చాంపియన్స్ వెనుదిరిగింది. సెమీ ఫైనల్లో భాగంగా చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ఎదుర్కోవాల్సి రావడమే ఇందుకు కారణం. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంతో ?క్రీడల్లోనూ ఎలాంటి 'బంధం' వద్దంటూ భారత ఆటగాళ్లు ఈ మ్యాచ్‌ను బహిష్కరించారు.

**దేశమే ముఖ్యమంటూ..**
ఫలితంగా ఇండియా చాంపియన్స్ టోర్నమెంట్ నుంచే వెనుదిరిగాల్సి వచ్చినా.. దేశమే తమకు ముఖ్యమంటూ ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు.. ఇండియా చాంపియన్స్ తప్పుకోవడంతో పాకిస్తాన్ చాంపియన్స్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంది.

**సర్వహక్కులు పాకిస్తాన్ క్రికెట్ బోర్డువే**
ఇక ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇకపై ప్రైవేట్ క్రికెట్ లీగ్‌లలో దేశం పేరును వాడటాన్ని పూర్తిగా నిషేధించినట్లు సమాచారం. వార్తా సంస్థ %ూచీ×% నివేదిక ప్రకారం.. "ప్రైవేట్ సంస్థలు పాకిస్తాన్ పేరును తమ లీగ్‌లలో ఉపయోగిస్తే వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటాం.




క్రికెట్ ఈవెంట్లలో దేశం పేరు వాడుకునే సర్వహక్కులు పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు మాత్రమే ఉన్నాయి. గురువారం జరిగిన బోర్డ్ డైరెక్టర్ల సమావేశంలో కూలంకషంగా చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. డబ్ల్యూసీఎల్ రెండో ఎడిషన్లో భారత క్రికెటర్లు పాకిస్తాన్‌తో ఆడమంటూ తిరస్కరించడం.. దేశ గౌరవానికి భంగం కలిగించింది. అందుకే ప్రైవేటు లీగ్‌లలో దేశం పేరు వాడవద్దని నిర్ణయించారు" అని పీసీబీ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

**ఆసియా కప్‌లో మాత్రం దాయాదుల పోరు!**
ఇదిలా ఉంటే.. ఆసియా కప్-2025లో మాత్రం టీమిండియా పాకిస్తాన్‌తో ఆడేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినట్లు తెలుస్తోంది. ఈసారి టీ20 ఫార్మాట్లో నిర్వహించే ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే, తటస్థ వేదికలపై మాత్రమే ఆడతామంటూ దాయాదులు గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. యూఏఈలో టోర్నీ జరుగనుంది. ఈ క్రమంలో లీగ్ దశలో ఓసారి, సూపర్ ఫోర్ మ్యాచ్‌లో ఓసారి చిరకాల ప్రత్యర్థులు తలపడే అవకాశం ఉంది. మరోవైపు.. డబ్ల్యూసీఎల్-2025లో శనివారం నాటి ఫైనల్లో పాకిస్తాన్.. సౌతాఫ్రికా చాంపియన్స్‌ను ఢీకొట్టనుంది.




## పరువాలతో కైపెక్కిస్తున్న ప్రియాంక జవాల్కర్


# మూవీస్





## షారూఖ్ ఖాన్‌కి నేషనల్ అవార్డ్ .. అల్లు అర్జున్ క్రేజీ రియాక్షన్

శుక్రవారం సాయంత్రం 71వ జాతీయ అవార్డులు ప్రకటించగా, ఇందులో తెలుగు సినిమాలు కూతా సత్తా చాటాయి. వివిధ విభాగాల్లో పలు తెలుగు చిత్రాలు, కళాకారులు అవార్డులను సొంతం చేసుకున్నారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'భగవంత్ కేసరి' అవార్డు గెలుచుకుంది. ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ కేటగిరిలో 'హనుమాన్' చిత్రం ఎంపికైంది. ఉత్తమ బాలనటిగా డైరెక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతివేణి (గాంధీ తాత చేటు) ఎంపికయ్యింది. ఉత్తమ గీత రచయిత అవార్డు 'బలగం' సినిమాకు దక్కింది . ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ అవార్డు 'బేబీ' సినిమాకు గాను సాయి రాజేష్ కు గౌరవం దక్కింది. ఉత్తమ గాయకుడిగా పీవీఎన్ఎస్ రోహిత్ (ప్రేమిస్తున్నా పాట) ఎంపికయ్యారు. ఈ అవార్డులు ప్రకటించగానే సినీ పరిశ్రమ నుంచి పలువురు ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు ప్రముఖులు విజేతలకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక తాజాగా అల్లు అర్జున్ 71వ జాతీయ అవార్డుల్లో విజయం సాధించిన వారందరికి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు పరిశ్రమకి ప్రాతినిధ్యం వహిస్తూ అవార్డులు గెలిచినవారికి ప్రత్యేక అభినందనలు తెలిపిన బన్నీ, హిందీ చిత్ర పరిశ్రమలో అవార్డులు పొందినవారిని కూడా అభినందించారు. ఉత్తమ నటుడిగా అవార్డు గెలుచుకున్న షారుక్ ఖాన్ మరియు విక్రాంత్ మస్సే లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. 33 ఏళ్ల కెరీర్‌లో మరో మైలు రాయి చేరిందని, ఇందుకు కారణమైన అట్లీకి కూడా బెస్ట్ విషెస్ అని బన్నీ పేర్కొన్నాడు. విక్రాంత్ మస్సే నటించిన '12%ష్ట్ర% ఫెయిల్' తనకు ఎంతో ఇష్టమైన సినిమా అని తెలిపారు. ఉత్తమ నటి అవార్డు అందుకున్న రాణీ ముఖర్జీ కి అభినందనలు చెప్పారు. ఈ మేరకు అల్లు అర్జున్ వరుసగా ట్వీట్లు చేస్తూ తన సంతోషాన్ని పంచుకున్నారు. తెలుగు సినిమా ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలబెట్టిన ఈ అవార్డులు, ఇండస్ట్రీలో అందరికీ గర్వకారణంగా మారాయి. కాగా, బన్నీ కూడా పుష్ప చిత్రానికి గాను నేషనల్ అవార్డ్ అందుకున్న విషయం తెలిసిందే.




## జపాన్‌లో నాగ్ క్రేజ్ మాములుగా లేదు.. ఇప్పుడు అక్కినేని ఫ్యామిలీ చిత్రం రీరిలీజ్‌కి రెడీ..!

బాహుబలి, వంటి సినిమాల రాకతో మన ఇండియన్ సినిమాలకి దేశ విదేశాలలో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా జపాన్‌లో అయితే తెలుగు సినిమా ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసే వారు వేలల్లోనే ఉన్నారు. మన సౌత్ హీరోలు రజనీకాంత్, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్,అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి వారికి రోజు రోజుకి ఫ్యాన్ ఫాలోయింగ్ పెరుగుతూ పోతుంది. ఇప్పుడు ఆ లిస్టులో మన కింగ్ నాగార్జున కూడా చేరిపోవడం విశేషం. అక్కడ నాగ్ సినిమాలు ఒక్కటి విడుదల కాకపోయిన కూడా నాగ్‌కి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది. ఐదేండ్ల క్రితం రణభీర్ కపూర్, అలియా భట్ జంటగా వచ్చిన భారీ చిత్రం బ్రహ్మాస్త్రలో నాగార్జున ఓ కీలక పాత్ర పోషించాడు. ఈ చిత్రం నాడు జపాన్‌లో విడుదలై మంచి విజయం సాధించిన క్రమంలో హీరో, హీరోయిన్స్‌తో పాటు నాగ్‌కి కూడా ప్రత్యేక ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఇక ఇటీవల కుబేర సినిమా ఓటీటీలో రిలీజ్ అవగా ఈ చిత్రాన్ని చూసిన అక్కడి ఫ్యాన్స్ నాగ్ సామ అంటూ ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. జపనీస్ సంస్కృతిలో 'సామ' అనే పదం దేవుళ్లు, రాజులు వంటి గౌరవనీయుల వారి పేరు పక్కన ఉపయోగిస్తారు.ఇప్పుడు నాగార్జునకు జపాన్ ప్రజలు ఇచ్చే గౌరవం ఎంత స్థాయిలో ఉందో చెప్పేందుకు ఇదే ఒక ఉదాహరణ. జపాన్ ప్రజల్లో నాగార్జునకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ చూసి 'మనం' సినిమాను అక్కడ రీ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక 'మనం' రీ-రిలీజ్ సందర్భంగా, థియేటర్‌కి వచ్చే జపాన్ అభిమానులతో వర్చువల్ వీడియో కాల్ ద్వారా నాగార్జున మాట్లాడనున్నారు. జూమ్ లేదా గూగుల్ మీట్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇది జపాన్ ఫ్యాన్స్‌కి ఓ మరిచిపోలేని అనుభూతి అవుతుందని చిత్ర బృందం భావిస్తోంది. అయితే ఆగస్ట్ 8న మనం చిత్రాన్ని రీరిలీజ్ చేయబోతున్నట్టు తెలుస్తుంది. ఈ మూవీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక 'కుబేర' విజయానంతరం నాగార్జున ఆగస్టు 14న విడుదల కాబోతున్న 'కూలీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమాలో ఆయన మాస్ యాక్షన్ లుక్‌లో విలన్ పాత్రలో కనిపించనున్నారు. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే ఈ సినిమాలో ఆయన పాత్ర సూపర్ స్టార్ రజనీకాంత్‌కు ధీటుగా ఉంటుందన్న ప్రచారం టాలీవుడ్‌లో జోరుగా నడుస్తోంది.

## 'కింగ్డమ్' పార్ట్ 2 అద్భుతంగా ఉండబోతుంది

పదేళ్ల క్రితం నేను ఎవరనేది ఎవరికీ తెలియదు. కానీ ఇప్పుడు ఈ స్తాయిలో ఉన్నాను. అదే నాకు గొప్ప విషయం. ఇన్ని కోట్ల మందిలో ఈ అవకాశం నాకు మాత్రమే దొరికింది. అది చాలు. ఈ స్థాయికి వచ్చినందుకు ఏదో ఒకటి చేయకపోతే అర్థం ఉండదు. అందుకే అర్జున్ రెడ్డికి వచ్చిన బెస్ట్ యాక్టర్ అవార్డుని వేలానికి వేసి ఓ మంచి పనికి ఉపయోగించాను. నెగెటివిటీని నేను పట్టించుకోను. నా చుట్టు ఉన్నవారితో పాటు అభిమానుల్లోనూ పాజిటివిటీ నింపాడానికే ప్రయత్నిస్తాను' అన్నారు హీరో విజయ్ దేవరకొండ. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'కింగ్డమ్' జులై 31న విడుదలై మంచి టాక్‌తో దూసుకెళ్తుంది. ఈ నేపథ్యంలో ఆయన తాజాగా మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు.. కింగ్డమ్ సినిమాకు వస్తున్న స్పందన పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. కేవలం తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాలలో, ఓవర్సీస్ లో విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా మలయాళంలో ఈ స్థాయి స్పందన ఊహించలేదు. మలయాళ వెర్షన్ విడుదల చేయకపోయినా.. అక్కడి ప్రేక్షకులు ఇంతటి ప్రేమ చూపించడం చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమాపై కురిపిస్తున్న ప్రేమనే నా దృష్టిలో బెస్ట్ కాంప్లిమెంట్. వాళ్ళకి సినిమా నచ్చడం ఎక్కువ సంతృప్తిని ఇస్తుంది. చాలా రోజుల తరువాత అభిమానుల కళ్ళల్లో ఆనందాన్ని చూశాను. మొదటి షో పూర్తవ్వగానే చాలామంది ఫోన్లు చేసి 'మనం హిట్ కొట్టినం' అని చెప్తుంటే మాటల్లో చెప్పలేనంత ఆనందం కలిగింది. కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలెబ్రేట్ చేసుకోవాలనే ఆలోచన ఉండదు. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. పెళ్లి చూపులు హిట్ అయినప్పుడు.. ఇంకొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడు అలా కాదు. సినిమా హిట్ అయితే ఆనందం కంటే కూడా మరిన్ని మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ సినిమా విడుదలకు ముందు ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. కింగ్డమ్ విడుదలకు ముందు మాక్కూడా అలాంటి ఒత్తిడి ఉంది. ఎప్పుడైతే మొదటి షో పూర్తయ్యి, పాజిటివ్ వచ్చిందో.. అప్పుడు చాలా సంతోషం కలిగింది. గౌతమ్(దర్శకుడు) కుటుంబ బంధాలను, ఎమోషన్స్ ని డీల్ చేసే విధానం నాకు ఇష్టం. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామా అనే ఐడియా గౌతమ్ చెప్పినప్పుడు నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. జెర్సీ లాంటి ఎమోషనల్ జర్నీలో కూడా మనకు హై ఇచ్చే మూమెంట్స్ ఉంటాయి. గౌతమ్ కి ప్రతి విషయం మీద పట్టు ఉంటుంది. హీరో పాత్ర, షాట్ కంపోజిషన్, మ్యూజిక్ ఇలా ప్రతిదాని మీద ఎంతో శ్రద్ధ తీసుకుంటాడు. కింగ్‌డమ్ కోసం ఆసక్తికర కథనం రాశాడు. ఇందులో ఏదో యాక్షన్ సన్నివేశం పెట్టాలి కదా అన్నట్టుగా ఎక్కడా పెట్టలేదు. దాని చుట్టూ బలమైన ఎమోషన్ ఉండేలా చూసుకున్నాడు. ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ప్రధానంగా కథ ఉంటుంది. కానీ, ఇందులో దేశభక్తికి సంబంధించిన అంశముంది. అలాగే, ఒక తెగకు చెందిన నాయకుడి గురించి ఉంటుంది. ఇలా ఇన్ని అంశాలను ఒకే భాగంలో చెప్పడం సాధ్యంకాదు. అందుకే రెండు భాగాలుగా చెప్పాలని నిర్ణయించుకున్నాము. తన అన్నయ్య శివ కోసం సూరి చేసిన ప్రయాణాన్ని మొదటి భాగంలో చూశాం. రెండవ భాగానికి సంబంధించి గౌతమ్ దగ్గర గొప్ప గొప్ప ఆలోచనలు ఉన్నాయి. మొదటి భాగంతో పోలిస్తే రెండవ భాగంగా ఇంకా అద్భుతంగా ఉండబోతుంది.



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108